# అగ్రనేత

తెలుగు దిన పత్రిక

TELTEL/2015/66279

రంగారెడ్డి | సంపుటి: 09 సంచిక :155 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది: శుక్రవారం 16-08-2024 | పేజీలు:4 వెల: 2.00


## ఆదానీకి ఉక్కు కవచంగా ప్రధాని మోడీ

విజయవాడ,,సెబి అదానీ అంశంపై దేశవ్యాప్తంగా ఆందోళనలు చేయాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. మీడియాతో మాట్లాడుతూ.. అదానికి ఇనుప కవచంలా మోదీ ఉన్నారని వ్యాఖ్యలు చేశారు. మోదీ వచ్చాక వ్యవస్థలను నిర్వీర్యం చేశారని విమర్శించారు. బంగ్లాదేశ్ మాజీ ప్రధానికి అహంభావం పెరిగిపోయిందని... ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేలా చర్యలు చేపట్టారన్నారు. ఎవరినైతే జైల్‌లో పెట్టారో వారే బంగ్లాదేశ్‌కు ప్రధాని అయ్యారన్నారు.హిందువులపై దాడులు చేస్తున్న వీడియోలు పెట్టి బీజేపీ పెద్ద యెత్తున ప్రచారం చేస్తున్నారన్నారు. వయనాడ్‌లో బాధితులను ఆదుకునేందుకు సీపీఐ పార్టీ సిద్ధంగా ఉందన్నారు. పార్టీ తరుపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీ లో స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో గవర్నర్ జోక్యాన్ని ఖండిస్తున్నామన్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి జైల్‌లో ఉన్నందున మరొకరికి వేడుకల బాధ్యతలు అప్పగించారన్నారు. గవర్నర్ జోక్యం చేసుకుని అడ్డుకోవడం సరికాదన్నారు.

## గోల్కొండలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు.. జెండా ఎగురవేసిన సీఎం రేవంత్



హైదరాబాద్,గోల్కొండ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొని జాతీయ జెండాను ఎగుర వేశారు. అనంతరం ఆయన పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించారు. అనంతరం రాష్ట్ర ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. దేశ పౌరులకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. మహానుభావుల త్యాగాలతో స్వాతంత్ర్యం సాధించామన్నారు. నెహ్రూ దార్శనికత ఫలితంగానే దేశం ఈ స్థాయిలో ఉందన్నారు. నెహ్రూ ప్రారంభించిన ప్రాజెక్టులతోనే దేశం సస్యశ్యామలంగా ఉందన్నారు. బీహెచ్ఈఎల్, మిధాని వంటి పరిశ్రమలను స్థాపించారన్నారు. లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ సాగులో విప్లవం తెచ్చారన్నారు. కాంగ్రెస్ దేశానికి చేసిన సేవలు ఇవి కొన్ని ఉదాహరణలేనన్నారు.

రైతుల రుణమాఫీతో మా జన్మధన్యమైంది: రేవంత్ రెడ్డి

హైదరాబాద్: వరంగల్ డిక్లరేషన్ అమలులో భాగంగా రుణమాఫీ చేస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. రుణమాఫీ అసాధ్యమని కొందరు వక్రభాష్యం చెప్పారని, రెండు లక్షల రూపాయాల వరకు రుణమాఫీ చేసి చూపిస్తున్నామని, రుణమాఫీపై విపక్షాలు రంధ్రాన్వేషణ చేస్తున్నాయని ధ్వజమెత్తారు. సాంకేతిక కారణాలతో కొందరికి రుణమాఫీ అందడంలేదని, అలాంటి వారిని గుర్తించి రుణమాఫీ అమలు చేస్తామన్నారు. కలెక్టరేట్ లో కౌంటర్లు ఏర్పాటు చేసి రుణమాఫీ సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రుణమాఫీ అమలుతో మా జన్మధన్యమైందని భావిస్తున్నామన్నారు.స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గోల్కొండ కోటలో జాతీయ జెండాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎగురవేశారు. తెలంగాణ ప్రజలను ఉద్దేశించి రేవంత్ ప్రసంగించారు. అమెరికా పర్యటనలో ప్రపంచ అధ్యక్షుడితో సమావేశం సానుకూలంగా జరిగిందని, తక్కువ వడ్డీకి రుణాలు ఇచ్చేందుకు ప్రపంచ బ్యాంక్ అంగీకరించిందని పేర్కొన్నారు. ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండు ఇప్పటికే అమలు చేశామని, ఆరోగ్య శ్రీ పథకానికి పూర్వ వైభవం తీసుకొచ్చామని, ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామని, ప్రభుత్వ ఆస్పత్రుల ఆధునీకరణకు కట్టుబడి ఉన్నామని రేవంత్ తెలియజేశారు. 43 లక్షల మందికి రూ.500 గ్యాస్ సిలిండర్ అందుతోందని కొనియాడారు. అర్హులైన అందరికీ రైతు భరోసా అందిస్తామని, గత ప్రభుత్వం అనర్హులకు రైతుబంధు ఇచ్చిందని మండిపడ్డారు. త్వరలోనే రైతు భరోసా పథకాన్ని ప్రారంభించబోతున్నామని రేవంత్ చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రేవంత్ చేతుల మీదుగా సీతారామ ప్రాజెక్ట్ ప్రారంభం

కొత్తగూడెం భద్రాచలం : లక్షలాది ఎకరాలకు సాగు నీరందించే లక్ష్యంతో నిర్మించిన సీతారామ ప్రాజెక్టును సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. నేటి మధ్యాహ్నం కొత్తగూడెం జిల్లా పూసుగూడెం చేరుకున్న ఆయన ముందుగా సీతారామ ప్రాజెక్టు వద్ద పైలాన్ ఆవిష్కరించారు.. అనంతరం దిగువ కాలువలోని నీళ్లు విడుదల కోసం మోటర్ స్విచ్ ఆన్ చేశారు%ూ% ఆ తర్వాత మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలతో కలసి గోదావరి జలాలకి పూజలు నిర్వహించారు.

## భారత్ ప్రస్థానం ప్రపంచానికే స్ఫూర్తిదాయకం

న్యూఢిల్లీ, భారత దేశ ప్రస్థానం ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఢిల్లీలోని ఎర్రకోటపై జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన జాతినుద్దేశించి ప్రసంగించారు. దేశ పౌరులకు ప్రధాని నరేంద్ర మోదీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత మాట్లాడుతూ.. హర్ ఘర్ తిరంగా వేడుకలు దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయన్నారు. దేశం కోసం పోరాడిన మహనీయులను స్మరించుకుందామని పిలుపునిచ్చారు.దేశం కోసం జీవితాలను పణంగా పెట్టిన మహనీయులు ఎందరో ఉన్నారని.. ప్రాణాలర్పించిన మహనీయులకు దేశం రుణపడి ఉందనన్నారు. భారత్ ప్రస్థానం ప్రపంచానికే స్ఫూర్తిదాయకమని.. శతాబ్దాల తరబడి దేశం బానిసత్వంలో మగ్గిందన్నారు. స్వాతంత్ర్యం కోసం ఆనాడు 40కోట్లమంది ప్రజలు పోరాడారని.. ఇప్పుడు దేశ జనాభా 140 కోట్లకు పెరిగిందని చెప్పారు. ఈ 140కోట్ల జనం కలలను సాకారం చేయాల్సి ఉందన్నారు. ఇందుకు లక్ష్యాన్ని నిర్దేశించుకొని ముందుకు సాగాలన్నారు. కొన్నేళ్లుగా విపత్తులు దేశాన్ని ఇబ్బందిపెట్టాయని.. విపత్తు బాధిత కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వికసిత భారత్ మనందరి లక్ష్యం

2047 నాటికి వికసిత భారత్ మనందరి లక్ష్యమని ప్రధాని తెలిపారు. భారత్‌ను ప్రపంచ నైపుణ్యాల రాజధానిగా మార్చాలని.. తయారీరంగంలో గ్లోబల్ హబ్‌గా భారత్‌ని తీర్చిదిద్దాలన్నారు. ప్రపంచానికే అన్నంపెట్టే స్థాయికి భారత్ ఎదగాలని.. దేశాభివృద్ధికి పాలనా సంస్కరణలు అవసరమన్నారు. న్యాయవ్యవస్థలో సంస్కరణలు అవసరమని అభిప్రాయపడ్డారు. అంతరిక్షంలో భారత స్పేస్‌స్టేషన్ త్వరలో సాకారం కావాలన్నారు. మనం అనుకుంటే 2047 నాటికి భారత్ అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందని చెప్పారు. వికసిత భారత్ 2047 నినాదం 140కోట్ల మంది కలల తీర్మానమని.. దళితులు, పీడితులు, ఆదివాసీలు గౌరవంగా బతకాలన్నారు. వోకల్ ఫర్ లోకల్ అనేది ప్రభుత్వ వ్యూహమని.. వోకల్ ఫర్ లోకల్ నినాదం ఆర్థిక వ్యవస్థలో మార్పులు తీసుకువచ్చిందని చెప్పారు.

సర్జికల్ స్ట్రయిక్స్‌ను ప్రజలు స్మరించుకుంటున్నారు

సర్జికల్ స్ట్రయిక్స్‌ను దేశ ప్రజలు సగర్వంగా స్మరించుకుంటున్నారని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. అభివృద్ధి బ్లూప్రింట్‌గా సంస్కరణలు తీసుకువస్తున్నామని.. నేషన్ ఫస్ట్.. రాష్ట్ర హిత్ సుప్రీం సంకల్పంతో ముందుకెళ్తున్నామన్నారు. బ్యాంకింగ్ రంగంలో ఎన్నో సంస్కరణలు అమలు చేశామని తెలిపారు. భారత బ్యాంకింగ్ వ్యవస్థ ప్రపంచంలోనే బలమైందని..



జల్‌జీవన్ మిషన్ ద్వారా 15కోట్ల మందికి లబ్ధి చేకూరిందన్నారు. భారత్ చిరుధాన్యాలు ప్రపంచంలోని అందరికీ చేరాలని.. భారీ సంస్కరణలు తెచ్చేందుకు ప్రభుత్వం సంకల్పం తీసుకుందన్నారు. దేశాభివృద్ధికి నూతన ఆర్థిక విధానాలు అమలు చేస్తున్నామని.. ఉపాధి కల్పనలో గణనీయమైన ప్రగతి సాధించామన్నారు. యువతకు నూతన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువుల, మైనారిటీల భద్రతపై 140 కోట్ల మంది భారతీయుల ఆందోళన : పీఎం మోదీ

బంగ్లాదేశ్‌లోని హిందువులు, మైనారిటీ భద్రతలపై 140 కోట్ల మంది భారతీయులు ఆందోళనలో ఉన్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకావిష్కరణ అనతరం ఎర్రకోటపై జాతినుద్దేశించి ఆయన ప్రసంగించారు. భారత్ పొరుగు దేశాల్లో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని భారత్ కోరుకుంటుందని.. అక్కడ పరిస్థితులు త్వరలోనే సాధారణ స్థితికి వస్తాయని ఆశిస్తున్నామన్నారు. అలాగే అక్కడి హిందువులు, మైనారిటీలకు భద్రత కల్పించాలని.. మన పొరుగు దేశం సుఖశాంతుల బాటలో నడవాలని ఆకాంక్షిస్తున్నారు.మానవ జాతి సంక్షేమం కోసమే భారత్ ఆలోచిస్తుందన్న ఆయన.. భారత్ తన వికాస్ యాత్రలో రాబోయే రోజుల్లో బంగ్లాదేశ్‌కు అండగా ఉంటుందన్నారు. ఇదిలా ఉండగా.. రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం హింసాత్మకంగా మారిన విషయం తెలిసిందే. ప్రధానిగా షేక్ హసీనా రాజీనామా హింసాత్మక దాడులు మరింత ఎక్కువయ్యాయి. రాజీనామా అనంతరం ఆమె భారత్‌కు చేరుకున్నారు. హిందువులతో పాటు మైనారిటీలపై దాడులు విపరీతంగా పెరిగాయి. ఆలయాలపై సైతం దాడులకు తెగబడుతూ దోచుకుంటున్నారు. ఈ క్రమంలో అక్కడి పరిస్థితులపై ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు.

## సంచలన విషయాలు బయటపెట్టిన పోస్టుమార్టం రిపోర్ట్..!

కోల్‌కత,దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనలో మరో షాకింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. ఆమెపై లైంగిక దాడి చేసింది ఒక్కరు కాదని, అది గ్యాంగ్ రేప్ అని పోస్టుమార్టం నివేదిక వెల్లడించిందని వైద్యులు చెబుతున్నారు. బాధితురాలి శరీరంలో అధిక మొత్తంలో 151 మిల్లీగ్రాముల వీర్యం ఉన్నట్టు తేలిందని డాక్టర్ సువర్ణ గోస్వామి తాజాగా ఓ జాతీయ మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ మేరకు బాధితురాలి తల్లిదండ్రులు కలకత్తా హైకోర్టులో వేసిన పిటిషన్‌లో వెల్లడించినట్టు కొన్ని మీడియా సంస్థలు కథనాలు ఇచ్చాయి. 151 ఎంజీ పరిమాణంలో వీర్యం అంటే ఒక్కరి నుంచి రాదని, లైంగిక దాడిలో పలువురి ప్రమేయం ఉన్నట్టు ఇది చెబుతున్నదని అఖిల భారత ప్రభుత్వ వైద్యుల సంఘం అదనపు ప్రధాన కార్యదర్శిగా కూడా ఉన్న డాక్టర్ గోస్వామి అన్నారు.

మా కుమార్తెపై జరిగింది గ్యాంగ్ రేప్..

తమ కుమార్తెపై సామూహిక లైంగిక దాడి జరిగిందని బాధితురాలి తల్లిదండ్రులు కలకత్తా హైకోర్టులో వేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. గొంతు పిసికి చంపడం వల్లనే తమ కుమార్తె మరణించినట్టు పోస్టుమార్టం నివేదిక వెల్లడించిందని తెలిపారు. తమ కుమార్తె సామూహిక లైంగిక దాడి, హత్యకు గురైనట్టు స్పష్టమైన ఆధారాలు కనిపిస్తున్నప్పటికీ ఇతర నిందితులను అరెస్టు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. కాలేజీ ప్రిన్సిపాల్, ఇతర సంబంధిత వ్యక్తులను ఇప్పటి వరకు అదుపులోకి తీసుకోలేదని పేర్కొన్నారు.కాగా, ఈ ఘటనపై వస్తున్న విమర్శల మీద సీఎం మమతా బెనర్జీ స్పందించారు. సీబీఐకి పూర్తిగా సహకరిస్తున్నా కూడా ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రాష్ట్రంలో బంగ్లాదేశ్ తరహా అల్లర్లు సృష్టించేందుకు బీజేపీ, సీపీఎం ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు.

సిల్చార్ కాలేజీ అడ్వైజరీపై విమర్శలు

బెంగాల్ ఘటన నేపథ్యంలో మహిళా సిబ్బంది, విద్యార్థినులకు అస్సాంలోని సిల్చార్ మెడికల్ కాలేజీ చేసిన సూచనలు విమర్శలకు కారణమయ్యాయి.



నిర్మానుష్య, చీకటి ప్రదేశాలకు వెళ్లొద్దని, రాత్రి పూట హాస్టల్ బయటకు రావొద్దని, మర్యాదగా మాట్లాడాలని అడ్వైజరీ జారీ చేసింది. దీనిపై విమర్శలు రావడంతో వెనక్కు తీసుకుంది.

యూజీసీ నెట్ షెడ్యూల్‌లో మార్పు..26న జరగాల్సిన పరీక్ష 27కు వాయిదా: ఎన్టీఏ

న్యూఢిల్లీ,ఈనెల 21 నుంచి మొదలవుతున్న యూజీసీ-నెట్ పరీక్షలకు సంబంధించి ఎన్టీఏ చిన్న మార్పు చేసింది. ఆగస్టు 26న 'కృష్ణ జన్మాష్టమి' వచ్చినందున, ఆ రోజు నిర్వహించాల్సిన పరీక్షను ఆగస్టు 27కు వాయిదా వేస్తున్నట్టు ఎన్‌టీఏ ప్రకటించింది. 'యూజీసీ-నెట్ జూన్ 2024 ఎగ్జామ్స్' షెడ్యూల్‌లో మిగతా పరీక్షలన్నీ ఇంతకు ముందు ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే జరుగుతాయని పేర్కొన్నది.

కేంద్ర హెూం శాఖ కార్యదర్శిగా గోవింద్ మోహన్

న్యూఢిల్లీ, కేంద్ర హెూం శాఖ తదుపరి కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి గోవింద్ మోహన్ నియమితులయ్యారు. మోహన్‌ను హెూం మంత్రిత్వ శాఖలో తక్షణం ఓఎస్‌డీగా నియమించారు. ప్రస్తుతం హెూం సెక్రటరీగా పనిచేస్తున్న అజయ్‌కుమార్ భల్లా పదవీ కాలం ఈ నెల 22తో ముగుస్తుంది. తదుపరి ఆయన స్థానంలో మోహన్ బాధ్యతలు చేపడతారు.

## అన్నా క్యాంటీన్లకు పునర్జీవం...చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం



గుడివాడ : ఏపిలో మళ్లీ అన్నా క్యాంటీన్ లు ప్రారంభమయ్యాయి.. స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఏపిలోని వివిద నగర,పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో వంద క్యాంటీన్ లను ఏకకాలంలో ప్రారంభించారు.. గుడివాడ మునిసిపల్ పార్క్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు , భువనేశ్వరి దంపతులు ఆన్నా క్యాంటీన్ కు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం స్వయంగా ముఖ్యమంత్రి దంపతులు భోజనాన్ని క్యాంటీన్ కు వచ్చిన వారికి స్వయంగా వడ్డించారు. ఆపై చంద్రబాబు దంపతులు సైతం సైతం 10 రూపాయిలు చెల్లించి టోకెన్ తీసుకుని మరీ అక్కడే భోజనం చేశారు. భోజనం చేస్తున్న సమయంలో చంద్రబాబు ప్రజలతో కాసేపు ముచ్చటించారు.ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగిస్తూ అన్న క్యాంటీన్లలో రూ.5కే అల్పాహారం, రూ.5కే భోజనం అందిస్తారని తెలిపారు. ప్రతి ఒక్కరం బతికేది జానెడు పొట్టకోసమేనని వ్యాఖ్యానించారు. కడుపు నిండా తిండి తినాలని కోరుకుంటామని తెలిపారు. ఆయన డొక్కా సీతమ్మ గురించి కూడా ప్రస్తావించారు. నాడు గోదావరి దాటి వచ్చిన వాళ్లకు డొక్కా సీతమ్మ తిండి పెట్టేదని, ఇప్పటికీ డొక్కా సీతమ్మను అన్నదానంలో మేటి మహిళగా గుర్తుపెట్టుకున్నామని చంద్రబాబు వివరించారు. ఎన్టీ రామారావు తొలిసారిగా ముఖ్యమంత్రి అయినప్పుడు తిరుపతిలో అన్నదానానికి శ్రీకారం చుట్టారని వెల్లడించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో తాము అన్న క్యాంటీన్లను తీసుకువస్తే, గత ప్రభుత్వం వాటిని రద్దు చేసిందని అన్నారు. "రద్దు చేయవద్దు%ూ% క్యాంటీన్లకు మీ పేరే పెట్టుకుని వాటిని కొనసాగించండి%ూ% పేదలకు పట్టెడన్నం పెట్టండి అని ఆనాడు కోరాం. ఒకవేళ మీరు అన్నం పెట్టలేకపోయినా దాతలు వస్తారని చెప్పాం. కానీ గత ప్రభుత్వం అవేవీ పట్టించుకోలేదు. అన్న క్యాంటీన్ల ద్వారా రూ.5కే భోజనం పెడుతుంటే అడ్డుకున్నారు. ఇక అలాంటి పరిస్థితి రాదు. సెప్టెంబరు నెలాఖరు నాటికి రాష్ట్రంలో 203 అన్న క్యాంటీన్లు ప్రారంభిస్తాం. గిరిజన ప్రాంతాల్లోని అన్ని మండల కేంద్రాల్లో అన్న క్యాంటీన్లు తీసుకువస్తాం. పేదవాళ్లకు తిండిపెట్టడం మనందరి కనీస బాధ్యత. ఓ మంచి ఉద్దేశంతో తీసుకువచ్చిన ఈ కార్యక్రమం కోసం హరేకృష్ణ చారిటబుల్ ఫౌండేషన్ ముందుకు రావడం సంతోషదాయకం. స్వచ్ఛందంగా ముందుకొచ్చి అన్న క్యాంటీన్లకు విరాళాలు ఇవ్వాలని పిలుపునిస్తున్నా. ఇది శాశ్వతంగా కొనసాగించే కార్యక్రమం కావాలని ఆకాంక్షిస్తున్నాను. ఇటువంటి మంచి కార్యక్రమానికి ఖర్చుపెడితే భగవంతుడి ఆశీస్సులు లభిస్తాయి" అని చంద్రబాబు వివరించారు.

## జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తెలంగాణ గవర్నర్..



హైదరాబాద్ : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ రాజ్ భవన్‌లో జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ విముక్తి కోసం పోరాడిన అసంఖ్యాక దేశభక్తుల త్యాగాలను కొనియాడారు.అలాగే స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి దేశ ప్రయాణాన్ని ప్రస్తావించారు. ప్రతి భారతీయుడు దేశం పట్ల గర్వంగా భావించాలని, దేశం, తెలంగాణ రాష్ట్రం రెండూ వేగంగా అభివృద్ధి చెందడానికి అవిశ్రాంతంగా కృషి చేయాలని ఈ సందర్భంగా గవర్నర్ తెలంగాణ ప్రజలకు సందేశం ఇచ్చారు. కాగా తెలంగాణ గవర్నర్ హెూదాలో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మొట్టమొదటి సారి జాతీయ జెండాను ఎగురవేశారు.

### అంటువ్యాధుల నివారణకు చర్యలు

విజయవాడ,గ్రామల్లో అంటువ్యాధుల నివారణకు పెద్ద ఎత్తున చర్యలు తీసుకుంటు న్నారు. ఇటీవలి వర్షాలకు పలు ప్రాంతాల్లో పెద్ద ఎత్తున సహాయక చర్యలు తీసుకున్నారు. పచ్చదనానికి తోడు పరిశుభ్రతతో ప్రజలకు వైద్యం చేరువ చేసే కార్యక్రమం ఊపందుకుంది. చంద్రబాబు అధికారం చేపట్టాక వరుస సమీక్షలతో కార్యక్రమాలను పట్టాలకు ఎక్కించే ప్రయత్నంలో ఉన్నారు. ఆస్పత్రుల్లో పెద్ద ఎత్తున వసతుల కల్పనతో పరిస్థితి మారుతోంది. వ్యాధి నిరోధక టీకాలైన మిజిల్స్, రుబెల్లా తదితర వ్యాక్సిన్‌ల ద్వారా వ్యాధినివారణకు ప్రభుత్వం నడుం బిగించింది. నెలల నుంచి 15 ఏళ్లలోపు వయస్సుగల పిల్లలకు మిజిల్స్, రుబెల్లా, తట్టు టీకాలను వేయించవచ్చని వైద్యాధికారులు తెలిపారు. గతంలో వేయించిన పిల్లలకు వ్యాక్సినేషన్ డ్రైవ్‌లో అదనపు డోసును వేయించవచ్చని వైద్యాధికారులు స్పష్టం చేశారు.

## కర్నాటక సర్కార్ సంచలన నిర్ణయం

బెంగళూరు: కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం సంచలనం నిర్ణయం తీసుకుంది. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లకు సిద్దరామయ్య సర్కార్ షాకిచ్చింది. ఆ రెండు బ్యాంకులతో తో అన్ని లావాదేవీలను నిలిపివేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్ బిఐ, పిఎన్ బి బ్యాంకుల్లోని ఖాతాలను మూసివేయాలని, డిపాజిట్లను వెంటనే రికవరీ చేయాలని అన్ని ప్రభుత్వ శాఖలను ఆదేశించింది.స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, పంజాబ్ నేషనల్ బ్యాంకుల్లో నిర్వహించే ఖాతాలను రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్‌లు, కార్పొరేషన్లు, స్థానిక సంస్థలు, యూనివర్సిటీలు, ఇతర ప్రభుత్వ సంస్థలు రద్దు చేయాలని ఆ ఆర్డర్‌లో పేర్కొన్నారు. అలాగే ఇకపై ఈ బ్యాంకుల్లోని ప్రభుత్వ ఖాతాల్లో డిపాజిట్లు చేయవద్దని స్పష్టం చేశారు. సీఎం సిద్ధరామయ్య ఆమోదించిన ఈ ఉత్తర్వును ఆర్థిక కార్యదర్శి జారీ చేశారు. బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన ప్రభుత్వ నిధులు దుర్వినియోగమైనట్లు కర్ణాటక ప్రభుత్వం ఆరోపించింది.నిధుల దుర్వినియోగంపై ఎన్నోసార్లు హెచ్చరించినప్పటికి తీరుమారలేదని తెలిపింది. రెండు బ్యాంకుల నుంచి ఎలాంటి స్పందన రాకపోవడం, సమస్య అపరిష్కృతంగా ఉండడంతో ప్రభుత్వం




ఈ మేరకు కఠిన నిర్ణయం తీసుకుంది. ఎస్ బిఐ, పిఎన్ బి ఖాతాల్లో అన్ని లావాదేవీలను నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై రెండు బ్యాంకులు , కేంద్ర ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచిచూడాలి.. మహర్షి వాల్మీకి కార్పొరేషన్ నిధుల గోల్‌మాల్‌లో బ్యాంకు అధికారుల హస్తముందని కర్ణాటక ప్రభుత్వం ఆరోపిస్తోంది.

# సంపాదకీయం

**శుక్రవారం 16-08-2024**

## ఎర్రకోట హామీలకు రెక్కలు రావాలి !

ఏటా స్వాతంత్ర్య దినోత్సవాన నేతలు గత స్మృతులను తలచుకుని....తమ ప్రభుత్వం బ్రహ్మాండంగా చేస్తున్నదని అందమైన మాటలు చెప్పడం చూస్తున్నాం. స్వాతంత్ర్య వేడుకల్లో ఆనాటి నేతలను స్మరించు కుంటున్నామే తప్ప వారి ఆశయాలను అమలు చేయడం లేదు. ఎర్రకోట వేదికగా ఏటా అందమైన అబద్ధాల తో ప్రజలను వంచిస్తున్నారు. అందుకే దాదాపు 77 ఏళ్లు కావస్తున్నా సామాన్యుల జీవితాల్లో మార్పు గురించి మాత్రం ఆలోచించడం లేదు. తమ అధికారం నిలుపుకోవడమెలా అన్న కోణంలోనే పథకాలు, పందేరాలు సాగిస్తూ పాలన చేస్తున్నారు. అందుకే దేశం అధిక జనాభాకు తోడు అనేకానేక సమస్యలను మోయాల్సి వస్తోంది. ప్రజలు పన్నుల రూపంలో కడుతున్న డబ్బులతో నేతలు జల్సాలు చేస్తున్నారు. పేదవారి పేరు చెప్పి పథకాల పేరుతో పందేరాలు చేస్తున్నారు. ఇంతకుమించిన అభివృద్ధి జరగడం లేదు. పేదలు ఇంకా పేదలుగానే మగ్గుతున్నారు. పేదల పేరు చెప్పి ఇంకెన్నాళ్లు రాజకీయం చేస్తారన్నది చూడాలి. ప్రజలు గుడ్డిగా నమ్మిన నేతలు సైతం వారి గొంతు కోసేందుకు వెనకాడడం లేదు. అప్పులు చేసి దివాళా తీయిస్తున్నా..పరిష్కారం చూడడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గత పాలకులు కెసిఆర్, జగన్‌లు రాష్ట్రాలను దివాళా తీయించారు. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడితే ఓ కుటుంబం రాజభోగా లు అనుభవించింది. ఎపిలో జగన్ కుటుంబం రాజకీయ భోగాలు అనుభవించింది. రాష్ట్ర విభజన పాపం కారణంగా రెండు రాష్ట్రాలు అప్పుల్లో కూరుకుని పోయి ఒకటి రెండు కుటుంబాలు బాగుపడ్డాయి. పదేళ్లుగా కేంద్రంలో మోడీ, అతని అనుయాయులు రాజ్యాధికారం అనుభవిస్తున్నారు. కరోనా తరవాత ప్రజల ఆర్థిక స్థితిగతులు అధ్వాన్నంగా మారినా పట్టింపు లేదు. తిండిగింజలు కొనడం గగనంగా మారింది. పప్పులు, ఉప్పుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. చమురు ధరలు ప్రజల చమురు వదిలిస్తున్నాయి. వివిధ రూపాల్లో పన్నులు పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తున్నాయి. సామాన్యులు ఇల్లు కట్టుకునే లేదా కొనుక్కునే పరిస్థితులు లేకుండా చేశారు. ఇన్సూరెన్స్ చేసుకుందామనుకున్నా జిఎస్టీ కొరడాలు ఝులిపిస్తున్నారు. ఇవన్నీ చర్చించడంలో విపక్షాలు విఫలం అవుతున్నాయి. డబ్బులు రాబట్టడమే లక్ష్యంగా కాబూలీవాలాను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తలపిస్తోంది. స్వాతంత్ర్యం వచ్చి వందేళ్ళు పూర్తయ్యే 2047 నాటికి మన దేశాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసి ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో చేరుస్తామని మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రకటనల్లో డొల్లతనం తప్ప మరోటి కాదు. గత పదేళ్లుగా చేసిన, చేస్తున్న నిర్వాకంతో ప్రజలు బతికి బట్ట కట్టడమే భారంగా మారుతోంది. వికసిత భారత్ పేరుతో ప్రజలను బురిడీ కొట్టించే ప్రయత్నాలు సాగుతున్నాయి. అభివృద్ధి చెందిన దేశం అంటే ప్రజలు తమంత తాముగా బతకగలగాలి. అందుకు అనువైన పరిస్థితులు కల్పించాలి. స్వయం ఉపాధి రంగాలు బలపడాలి. వ్యవసాయం బలోపేతం కావాలి. రైతులు ధీమాగా బతకగలగాలి. కానీ అలా జరగడం లేదు. దేశంలోని ప్రజల సగటు తలసరి ఆదాయాన్ని బట్టి అభివృద్ధి చెందిన, చెందుతున్న లేదా వెనుకబడిన దేశాలుగా అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు లెక్కగడుతాయి. 15 వేల కోట్లు ఖర్చు పెట్టి పెళ్ళి చేసిన అంబానీ ఆస్తి, కనీసం పెళ్ళి చేసే ఆర్థిక స్థోమత లేక దాతలు ఇచ్చే ఉచిత తాళి కోసం ఎదురుచూసే పేదవాని ఆస్తి కలిపి సగటు ఆదాయాన్ని లెక్కిస్తారు. అంబానీ ఆస్తి నుండి పేదవానికి నయా పైసా రాకపోయినా, సగటు లెక్కల్లో మాత్రం ఇద్దరి ఆస్తి సమానమౌతుంది. ఇదే ఇంతకాలం మనం చేస్తున్న జిమ్మిక్కు లెక్కలు. పేదవాడికి ఇంకా ఉచిత బియ్యం సరఫరా చేయడమంటేనే పేదలు పేదలుగానే ఉన్నారని అర్థం చేసుకోవాలి. ఇల్లు కొనుక్కోలేక పోతున్నారంటేనే దేశం అభివృద్ధి చెందడం లేదని అర్థం. మూడు కోట్ల ఇళ్లు కట్టిస్తామని మోడీ చేసిన ప్రకటన దేశ దౌర్భాగ్య పరిస్తితులను సూచిస్తోంది. ఉపాధి కోసం విదేశాలకు వెళుతున్నారంటేనే దేశంలో అవకాశాలు లేవని అర్థం. జిఎస్టీపై పార్లమెంటులో ప్రస్తావన వస్తే చర్చించలేని పెద్దలు పేదల గురించి, దేశం పురోగతి గురించి ఆలోచిస్తారంటే ఎలా నమ్మడం. వీరి చేతుల్లో ఉన్న పనులనే చేయడం లేదు. జిఎస్టీ ట్యాక్సులను తగ్గించలేని వారు, ఉపాధి కల్పనకు ఉన్న అవకాశాలను అందిపుచ్చుకోలేని వారు వ్యవసాయాన్ని అభివృద్ధి చేయాలనే ఆలోచన లేని వారు, నదీ జలాలలను సద్వినియోగం చేయాలనే పట్టుదల లేని వారు..దేశాన్ని అభివృద్ధి చేస్తామంటే నమ్మగలమా? దేశం అభివృద్ధి చెందాలంటే మానవ వనరులను ఉపయోగించుకోవాలి. వ్యవసాయిక దేశంగా ఉన్న మన దేశంలోని భూములను వినియోగంలోకి తీసుకుని రావాలి. నీరు సముద్రం పాలు కాకుండా వాడుకోగలగాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలి. రాజకీయ నాయకుల జీతభత్యాలు తొలుత తగ్గించాలి. పెట్టుబడులు పెరగాలి. తయారీ, సేవలు, ఎగుమతుల తయారీ రంగాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. కొత్త సాంకేతిక పరిజ్ఞానం కోసం పరిశోధనలు చేయాలి. దేశ యువతకు ఉపాధి చూపించడానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. ఈ దిశగా మన ఆర్థిక విధానాలు వుండాలి. అప్పుడే తయారీ రంగంతో పాటు, మౌళిక రంగాలు అంటే రైల్వే, రోడ్లు, గృహ వసతి, నీటి పారుదల, విద్యుత్, విద్య, వైద్య రంగాలతో పాటు వ్యవసాయాభివృద్ధికి పెట్టుబడులుగా పెరుగుతాయి. ఈ రంగాల్లో పెట్టుబడి ఖర్చులు ఎక్కువ,ఆదాయం తక్కువ. కావున, ప్రైవేట్ పెట్టుబడులు రావు. ప్రభుత్వ మే ఈ రంగాల్లో పెట్టుబడులు పెట్టాలి. కానీ 1991 తర్వాత అమలవుతున్న ప్రపంచీకరణ విధానాలు సరిగ్గా ఇందుకు విరుద్ధంగా వున్నాయి. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించడం, రైల్వే, రోడ్లు, విమానాశ్ర యాలు, ఓడరేవులు, బ్యాంకులు, ఇన్సూరెన్స్, టెలికం, విద్య, వైద్య రంగాలతో పాటు కీలకమైన వ్యవసా యాన్ని కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే విధానాలను గత 25 సంవత్సరాలుగా పాలకులు అమలు చేస్తున్నారు. దీని ఫలితంగా దేశ ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. మోడీ పాలనలో కేంద్ర ప్రభుత్వ అప్పు రూ.82 లక్షల కోట్లకు పెరిగింది. ఈ ఆర్థిక సంవత్సరానికి మరో రూ.12 లక్షల కోట్లు అప్పు చేయడానికి బడ్జెట్‌లో ప్రతిపాదనలు పెట్టారు. ఇలాంటి విధానాలు అవలంబించినంత కాలం దేశం వికసితం కాదు. అది సాధ్యంకాదు. ఇవన్నీ పాలకులకు తెలుసు. అందుకే అందమైన తీయటి మాటలతో ప్రజలను ఇంకా భ్రమల్లో ముంచుతున్నారు. ఏటా ఎర్రకోట సాక్షిగా అబద్దాలు చెబుతున్నారు. అభూత కల్పనలు సృష్టిస్తున్నారు. చిత్తశుద్ధితో, నిజాయితీగా, దీక్షతో పనిచేస్తే భారత్ లాంటి దేశం అభివృద్ధికి ఓ ఐదు, పదేళ్ల సమయం చాలు. ఈ లక్ష్యం ఉన్న నేతలు వచ్చినప్పుడే దేశం పురోగమిస్తుంది. మాటల గారడీలు చేసేవారితో ఇది సాధ్యం కాదు.

# లోక్‌సభలో దక్షిణాది సీట్లకు గండి?

న్యూఢిల్లీ,దేశంలో చివరిసారిగా 1971వ సంవత్సరం జనాభా లెక్కల ప్రకారం 1977వ సంవత్సరం నాటికి 543 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 1976వ సంవత్సరంలో నాటి ప్రధాని ఇందిరా గాంధీ 42 వ రాజ్యాంగ సవరణ ద్వారా 2021 జనగణన వరకు లోక్‌సభ స్థానాలను పెంచకుండా చట్టంచేశారు. అందుకు ప్రధాన కారణం దేశంలో జనాభా నియంత్రణను అమలు చేస్తున్న రాష్ట్రాలు నష్టపోకూడదని, జనాభా నియంత్రణను అన్ని రాష్ట్రాలు పాటించాలన్న ఉద్దేశంతో అనాడు ఇందిరా గాంధీ సర్కార్ చట్టం చేశారు. కానీ అప్పుడు ఏ కారణం చేతైతే జనాభా నియంత్రణను పాటిస్తున్న రాష్ట్రాలు నష్టపోవొద్దన్న భావనతో చట్టం తీసుకురాగా, ఇప్పుడు అదే చట్టం జనాభా నియంత్రణను పకడ్బందీగా అమలు చేసి విజయం సాధించిన రాష్ట్రాల పాలిట శాపం కానుందని జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజన చేసే విధానాన్ని చూస్తే అర్థమవుతుంది. 2002 సం.లో అటల్ బిహారీ వాజపేయి నేతృత్వంలోని ఎన్‌డిఎ 84వ రాజ్యాంగ సవరణ చేసి 2026 తరువాత జరిగే తొలి జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాల సంఖ్య పెంచాలని నిర్దేశించింది. పునర్విభజన ద్వారా అనుసరించే విధానాల వల్ల కేంద్రం సూచనల మేరకు కుటుంబ నియంత్రణ ద్వారా జనాభా పెరుగుదలకు అడ్డుకట్ట వేసిన దక్షిణాది రాష్ట్రాలకు తీరని నష్టం వాటిల్లనుంది. జనాభా తక్కువగా ఉండడం మూలాన లోక్‌సభలో ఆయా రాష్ట్రాల ప్రాతినిధ్యానికి భారీగా కోతపడనుంది.దేశంలో ఉత్తరాది రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాలు తెలంగాణ, కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల జనాభా తక్కువ. లోక్‌సభ నియోజక వర్గాల పునర్విభజనకు అనుసరించే ఈ జనాభా లెక్కల ప్రామాణికంతో ప్రస్తుతం దక్షిణాది రాష్ట్రాలకు లోక్‌సభలో ఉన్న 543 మొత్తం స్థానాల్లో 23.74 శాతం అంటే 129 స్థానాల ప్రాతినిధ్యం ఉండగా, కేంద్రం అనుసరించే పునర్విభజన వల్ల ఆ రాష్ట్రాల ప్రాతినిధ్యం 6.26 శాతం తగ్గిపోయి 129 స్థానాల నుండి 103 స్థానాలకు పడిపోనుంది.కానీ ఇబ్బడిముబ్బడిగా జనాభాను పెరుగుదలలో పెద్దన్న పాత్ర పోషించిన ఉత్తరాది రాష్ట్రాలకే వరంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన విధానాలు ఉండడం గమనార్హం. అంటే 2026లో పునర్విభజన విధానాల ద్వారా జనాభా నియంత్రణలో దక్షిణ రాష్ట్రాల సాఫల్యత వాటి రాజకీయ ప్రాతినిధ్యానికే ఎసరు పెడుతుంది. లోక్‌సభలో ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని ఒకేసారి పరిశీలిస్తే.. ప్రస్తుత సీట్లు 543 లో ఉత్తరాది రాష్ట్రాలైన యుపి 80 సీట్లు, మహారాష్ట్ర 48, పశ్చిమ బెంగాల్ 42, బీహార్ 40, మధ్యప్రదేశ్ 29 సీట్లను కలిగి ఉండగా, దక్షిణాది రాష్ట్రాలు ఎపి, తెలంగాణ 42 సీట్లు, కర్ణాటక 28 సీట్లు, కేరళ 20 సీట్లు, తమిళనాడు 39 సీట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. పునర్విభజన కోసం రెండు ప్రతిపాదనలను ఆలోచిస్తున్న కేంద్రం మొదటగా జనాభా లెక్కల ప్రకారం లోక్‌సభ స్థానాలను 848కి పెంచి దేశ జనాభాతో భాగించగా వచ్చేది దేశ పార్లమెంట్ స్థానం



సగటు జనాభా, ఈ సగటు పార్లమెంటు జనాభా సంఖ్యతో రాష్ట్ర జనాభాను భాగిస్తే ఆ రాష్ట్రంలోని పార్లమెంటు స్థానాల సంఖ్య వస్తుంది.ఈ విధంగా చూస్తే మన దక్షిణాది రాష్ట్రాల స్థానం పార్లమెంటులో స్థానాలు 130 నుండి 165కు కొద్ది మేర పెరిగిన నిష్పత్తి ప్రకారం చూస్తే దారుణంగా 23 శాతం నుండి 19 శాతానికి పడిపోనుంది.. ఇక రెండో ప్రతిపాదన ఏంటంటే.. లోక్‌సభ స్థానాలను ప్రస్తుతం ఉన్న 545కే పరిమితం చేసి చేపట్టబోయే జనాభా లెక్కల ప్రకారం పునర్విభజించటం. ఇలా చేసినా నష్టపోయేది దక్షిణాది రాష్ట్రాలే. ఈ విధానంలో దేశ జనాభాను 545తో భాగిస్తారు. అప్పుడు జనాభా అధికంగా పెరిగిన రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలు కూడా పెరుగుతాయి. జనాభా తక్కువ ఉన్న రాష్ట్రాల్లో తగ్గిపోతాయి. ఈ లెక్కన తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 లోక్‌సభ స్థానాలు 14కు పడిపోతాయి. అంటే మూడు స్థానాలు ఎగిరిపోతాయి. రెండింటిలో ఏ విధానంలో నియోజక వర్గాలను పునర్విభజించినా కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి పార్టీ తమ ప్రాబల్యం అధికంగా ఉన్న ఉత్తరాది రాష్ట్రాలే.. అంటే పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల మాట ఏ మేరకు చెల్లుబాటు అవుతుందో అర్థం చేసుకోచ్చు.దక్షిణాది రాష్ట్రాల మాదిరిగా కుటుంబ నియంత్రణకు ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో అధిక జనాభా కలిగిన ఉత్తరాది రాష్ట్రాలు లోక్‌సభ లో తమ సీట్ల సంఖ్యను ఇప్పటికన్నా ఎక్కువగా పెంచుకొనున్నాయి. ఈ లెక్కన చూస్తే పరిపాలన, అభివృద్ధి, జనాభా నియంత్రణ వంటి అంశాలపై దృష్టి సారించిన దక్షిణాది రాష్ట్రాలకు శిక్షగా లోక్‌సభ ప్రాతినిధ్యానికి, రాజకీయ ప్రాధాన్యానికీ కోతపడబోతుందన్నమాట. దాని వల్ల హక్కుగా రావాల్సిన నిధుల కోసం డిమాండ్ చేసే సత్తా, అనుకూలమైన విధానాల రూపకల్పన చేసేలా కేంద్రంపై ఒత్తిడి చేయగల శక్తి దక్షిణాది రాష్ట్రాలకు తగ్గుతుంది. పర్యవసానంగా ఉత్తర %-% దక్షిణ విభేదాలు, ప్రాంతీయ ఉద్రిక్తతలకు పెచ్చరిల్లే ప్రమాదం కూడా లేకపోలేదు. కాబట్టి దక్షిణాది రాష్ట్రాలు అప్రమత్తమై దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అసమానతలు లేకుండా లోక్‌సభ స్థానాలను పునర్విభజన చేసే విధంగా ఇతర రాష్ట్రాల రాజకీయ పార్టీలతో స్థూలమైన ఏకాభిప్రాయాన్ని సాధించి తమ రాజకీయ ప్రాధాన్యతను కాపాడుకోవాలి.

# నిర్లక్ష్య ఫలితం...



హైదరాబాద్,పాలకులు చెప్పే మాటలకు ఆచరణకు ఏమాత్రం పొంతన ఉండదనడానికి తుంగభద్ర డ్యామ్ ప్రస్తుత పరిస్థితే నిలువెత్తు నిదర్శనం. కర్ణాటకతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు ఈ ప్రాజెక్టు నుండి సాగు, తాగు నీరు అందుతోంది. ఈ మూడు రాష్ట్రాలకు చెందిన లక్షలాది మంది ప్రజానీకం ఈ ప్రాజెక్టుపై ఆధారపడి ఉన్నారు. ప్రాజెక్టుకు జరగరానిది ఏదన్నా జరిగితే ఈ మూడు రాష్ట్రాలపైనా ప్రభావం పడుతుందన్నది అందరికి తెలిసిన విషయమే! ఇంత కీలకమైన ప్రాజెక్టు నిర్వహణలో ప్రభుత్వాలు, తుంగభద్ర బోర్డు నిర్లక్ష్యం ఫలితం గత శనివారం (10వ తేది) చోటుచేసుకున్న దిగ్భ్రాంతికరమైన పరిణామం! డ్యామ్‌కు ఉన్న 33 గేట్లలో 19వ గేటు అనూహ్యంగా కొట్టుకుపోయింది. దీంతో ప్రాజెక్టు కింద ఖరీఫ్ సీజన్‌లో సాగు ప్రశ్నార్థకంగా మారింది. తుంగభద్ర డ్యామ్ పూర్తి సామర్థ్యం 105 టిఎంసిలు కాగా, 40 నుండి 45 టింఎసిల నీటిని దిగువకు వదిలివేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. కృష్ణానది మీద ఉన అన్ని ప్రాజెక్టులు ఇప్పటికే పూర్తి సామర్థ్యానికి చేరుకోవడంతో ఈ నీటిని అనివార్యంగా సముద్రానికి వదలాల్సిందే! దీంతో పాటు, పరివాహ ప్రాంత ప్రజానీకానికి ముంపు ప్రమాదం! అయితే, గేటు కొట్టుకుపోయిన తరువాత ప్రభుత్వాలు అప్రమత్తం కావడం, కొన్ని తక్షణ చర్యలు చేపట్టడం మంచిదే! ఈ సమన్వయం కొనసాగి, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు పూర్తి స్థాయిలో జరగాలి.అంతరాష్ట్ర ప్రాజెక్టు కావడంతో కేంద్ర ప్రభుత్వ పర్యవేక్షణ లోని నిర్వహణ, నియంత్రణ బాధ్యతలను తుంగభద్ర బోర్డు చూస్తుంది. బోర్డు సమావేశంలో నీటి పంపకాలకు సంబంధించిన కుస్తీ తప్పితే కీలకమైన డ్యామ్ భద్రతకు సంబంధించిన చర్చ నామమాత్రమేనని సమాచారం. ఈ నిర్లక్ష్యమే 1953లో నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ డ్యామ్‌కు ప్రస్తుత దుస్థితి ఏర్పడటానికి కారణం. ప్రమాదం జరిగిన 'శనివారం రోజు రాత్రి 12 నుండి 21వ నెంబర్ వరకు ఉన్న గేట్లను 1.50 అడుగు మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తుండగా 19వ నెంబర్ గేటు స్పిల్ వే నుండి జారి, ఒక్కసారిగా కొట్టుకుపోయింది.' అని తుంగభద్ర బోర్డు తెలిపింది. గేటును ఆపరేట్ చేయడానికి వినియోగించే చైన్‌లోని లింకు తెగిపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని, డ్యామ్‌ను కాపాడటం కోసం మిగిలిన అన్ని గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నట్లు బోర్డు వివరించింది. నిజానికి, చైన్‌లోని లింకుల సమస్య ఇప్పటికిప్పుడు వచ్చింది కాదు. మూడు నాలుగు సంవత్సరాల క్రితం కూడా ఇదే సమస్య రావడంతో అప్పటికప్పుడు హడావిడిగా వెల్డింగ్ చేసి చేతులు దులుపుకున్నారు. చైన్ పూర్తిగా పాతబడిపోయిందని, దాని స్థానంలో క్రస్ట్ గేట్లను నిర్వహించడానికి స్టీల్ కేబుల్‌ను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ముందుకు వచ్చినప్పటికీ, ఇప్పటికీ ఆచరణ రూపం దాల్చలేదు. ఇప్పుడు గేటు పూర్తిగా కొట్టుకుపోవడంతో కొత్త గేటును హడావిడిగా తయారు చేయిస్తున్నారు. స్టాప్‌లాక్‌ను ఏర్పాటు చేయడం, కొత్త చైన్‌ను బిగించడం వంటి పనులు కూడా చేయాల్సి ఉంది. ప్రాజెక్టులో నీరు ఉండటంతో అనేక సాంకేతిక సమస్యలు ముందుకు వస్తున్నాయి. వీటన్నింటిని అధిగమించి సమస్యను పరిష్కరించాల్సి ఉంది.తుంగభద్ర ప్రాజెక్టు ఒక్కటే కాదు, అన్నమయ్య, గుండ్లకమ్మ, పులిచింతలతో పాటు అనేక ప్రాజెక్టులు కూడా ఈ తరహా దుస్థితినే ఎదుర్కుంటున్నాయి. గేట్లకు, హైడ్రాలిక్‌లకు, రోప్‌లకు గ్రీస్ పూయడానికి కూడా నిధులు ఉండటం లేదని ఇంజినీర్లు చెబుతున్నారు. వరద నిర్వహణలో వైఫల్యం చెందడంతో అన్నమయ్య ప్రాజెక్టు ధ్వంసమై, పలువురి ప్రాణాలను తీసుకుంది. 2020 సెప్టెంబర్‌లో పులిచింతల ప్రాజెక్టులో హైడ్రాలిక్ సిస్టమ్ దెబ్బతిని గేటు కొట్టుకుపోయింది. పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ 10వ గేట్‌కు చెందిన రోప్ తెగిపోయింది. గుండ్లకమ్మ రిజర్వాయర్‌లో మూడవ గేట్ ధ్వంసం అయ్యింది. 2019లో దెబ్బతిన్న శ్రీశైలం ఫ్లంజ్‌పూల్ మరమ్మతులకు ఇప్పటి వరకు అతీగతి లేదు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో! రైతు సంక్షేమం అంటూ మాటలు చెప్పే పాలకులు ఈ వాస్తవ స్థితిపై దృష్టి సారించాలి. ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించాలి. భారీ మొత్తంలో నిధులు ఖర్చు చేసి, నిర్మించిన ప్రాజెక్టులను కాపాడుకుంటేనే భావి తరాలకు భద్రత చేకూరుతుంది.

# ప్రతిష్టాత్మకంగా రీజినల్ రింగ్ రోడ్డు

హైదరాబాద్,హైదరాబాద్ రీజినల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణ కార్యక్రమానికి అత్యధిక ప్రాధాన్యత నిచ్చి, సెప్టెంబర్ రెండవ వారంలోగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన భూ సేకరణ పూర్తిచేయాలని సంబందిత జిల్లా కలెక్టర్‌లను ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణ పనుల పురోగతిపై మంగళవారం సచివాలయంలో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశానికి రోడ్లు భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ప్రభుత్వ సలహాదారులు శ్రీనివాస్ రాజు, రెవిన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్ మిట్టల్, అటవీ శాఖ అడిషనల్ సెక్రటరీ ప్రశాంతి, ప్రత్యేక కార్యదర్శి హరిచందన, సంయుక్త కార్యదర్శి హరీష్, రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, యాదాద్రి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సి.యస్. శాంతి కుమారి మాట్లాడుతూ, ప్రతిష్టాత్మక ప్రాజెక్టు రాష్ట్రంలో అత్యధిక ప్రాముఖ్యత సంతరించుకున్నదని, ఈ ప్రాజెక్ట్ సంబంధించి వివిధ దశలలో పెండింగ్ లో ఉన్న భూసేకరణ పక్రియ ను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. భూసేరణ నష్ట పరిహారనికి సంబంధించిన అంశంపై ప్రత్యేక దృష్టి సారించి భూములు కోల్పోతున్న రైతులకు న్యాయ పరమైన నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూములు కోల్పోతున్న రైతులకు సరైన నష్టపరిహారం అందేవిదంగా జిల్లా స్థాయి లో కలెక్టర్ల అధ్యక్షతన కమిటీలను ఏర్పాటు చేసి భూముల మార్కెట్ విలువ ఆధారంగా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. కోర్టు కేసుల పై కూడా ప్రత్యేక చొరవ తీసుకుని త్వరితగతిన పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు.

## యూనివర్సిటీల్లో ఉన్నత విద్యలో మెరుగైన విద్య

అమరావతి,ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీల్లో ఉన్నత విద్యలో మెరుగైన విద్య, ర్యాంకింగ్స్, సంస్కరణల అమలుకు సహాయ, సహకారాలు అందిస్తామని నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ సింగపూర్ ప్రొఫెసర్ ఎం.వి.ఆర్.చౌదరి స్పష్టం చేశారు. ఏపీలో ఉన్నత విద్యారంగంలో సంస్కరణలకు తప్పకుండా తోర్పాటు అందిస్తామని విద్యా, ఐటీ శాఖ మంత్రి లోకేశ్‌కు ఆయన హామీ ఇచ్చారు. సోమవారం రోజున నేషనల్ ఇనిస్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ 2024లో ఏపీకి చెందిన 31 యూనివర్సిటీలు చోటు సంపాదించాయి. అయితే వీటిలో మరింత మెరుగైన విద్య అందించేందుకు ఎం.వి.ఆర్. చౌదరితో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ మేరకు రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల పనితీరు మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై వారిద్దరూ కూలంకశంగా చర్చించారు. రీసెర్చ్, ఇన్నొవేషన్స్‌లో వెనకబడి ఉండటమే ఏపీలో ర్యాంకింగ్స్ తగ్గుదలకు కారణం అని ఆయన చెప్పారు. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తేవడానికి అవసరమైన పాఠ్యాంశాల మార్పులు, ఇతర విధానాలను విశ్వవిద్యాలయాలతో పంచుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ప్రొఫెసర్ చౌదరి వెల్లడించారు. కార్యచరణ అమలుకు త్వరలోనే ప్రణాళిక రూపొందించనున్నట్లు మంత్రి లోకేశ్ చెప్పారు.

## ఎన్ఆర్ఐ డాక్టర్ ఇల్లు బేరంలో మోసం

హైదరాబాద్,హైదరాబాద్‌లోని తన ఇల్లు విక్రయానికి పెట్టిన ఓ ఎన్ఆర్ఐ వైద్యురాలి బ్యాంకు ఖాతా లావాదేవీలను సైబర్ పోలీసులు నిలిపివేశారు. రూ.10 కోట్లకు సంబంధించి జరిగిన లావాదేవీల్లో సైబర్ మోసం జరిగినట్లు పోలీసులు గుర్తించారు. దీంతో నగరానికి వచ్చిన ఆమె జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమెరికాలో నివసించే డాక్టర్ బినోతి మార్తాండ్‌కు జూబ్లీహిల్స్ నందగిరిహిల్స్‌లో 334 చదరపు గజాల స్థలంలో ఇల్లు ఉంది. దీన్ని విక్రయించడానికి నిర్ణయించి వివరాలు ఇంటర్నెట్‌లో పెట్టారు. గురునాథ్ అనే రియల్ఎస్టేట్ ఏజెంట్‌ను కూడా నియమించుకున్నారు. అతని ద్వారా 2022లో షేక్ బషీర్ అలియాస్ బాబు అనే వ్యక్తి ఆమెను వాట్సప్‌లో సంప్రదించారు. అయితే ఎలాంటి ఒప్పందానికి రాలేదు. తాజాగా ఈ ఏడాది జులైలో బషీర్ ఆమెకు ఫోన్‌చేసి.. రూ.12.5 కోట్లకు ఒప్పందం చేసుకోగా మూడు విడతలుగా రూ.11 కోట్లు ఆమె సూచించిన ఖాతాకు బదిలీ చేశారు. మరో రూ.1.5 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. టీడీఎస్‌కు డబ్బులు కట్టాల్సి ఉందని బషీర్ కోరడంతో ఆమె రూ.1,48,75,000 అతని ఖాతాలో వేశారు. ఈ క్రమంలో జులై 16న షేక్ బషీర్ ఆ ఇంటిని తన అధీనంలోకి తీసుకున్నారు. అయితే 19వ తేదీన ఊహించని రీతిలో ఎన్ఆర్ఐ ఖాతాను సైబర్ పోలీసులు సీజ్ చేశారు. ఈ చెల్లింపుల్లో సైబర్ మోసం జరిగిందంటూ ఖాతాను నిలిపివేసినట్లు పేర్కొన్నారు. దీంతో షాక్‌కు గురైన వైద్యురాలు వెంటనే బషీర్‌కు ఫోన్ చేశారు. స్పందించక పోవడంతో 28న తన కుమారుడు జాన్ మార్తాండ్‌తో ఆమె హైదరాబాద్‌కు వచ్చారు. ఇంటివద్దకు వెళ్లగా బషీర్‌కు చెందిన సెక్యూరిటీ సిబ్బంది కనిపించారు. అంతకుముందు ఏర్పాటుచేసిన సీసీ కెమెరాలను తొలగించి వేరేవి పెట్టినట్లు గుర్తించారు. బషీర్ తన ఫోన్‌కాల్స్‌కు స్పందించకపోవడంతో ఆమె ఈ విషయమై ఫిర్యాదు చేసినట్లు జూబ్లీహిల్స్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

## వరలక్ష్మీవ్రతం ఆచరణ..సకల సంపదల హేతువు

తిరుమల, భారతీయ సంప్రదాయంలో వరలక్ష్మి వ్రతానికి చాలా ప్రాముఖ్యత ఉంది. ప్రతి సంవత్సరం శ్రావణ మాసంలో వరలక్ష్మి వ్రతం ఆచరించి లక్ష్మీదేవిని పూర్తి ఆచార వ్యవహారాలతో పూజిస్తారు. వరలక్ష్మి వ్రతం శ్రావణ మాసంలో పౌర్ణమికి మందు వచ్చే శుక్రవారం రోజున ఆచరిస్తారు. మహిళలు ప్రత్యేకంగా ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. తమ మాంగల్యం పటిష్టంగా ఉండాలి, అష్టయిష్వర్యాలు దక్కాలని కోరుకుంటూ లక్ష్మీదేవిని పూజిస్తారు. ఇలా శుక్రవారం రోజున లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేస్తారు. అలాగే ఆనందం, శాంతి ఉండాలంటూ ఉపవాసం పాటిస్తారు. దక్షిణ భారతదేశంలో ఈ పండుగను ఎంతో ఉత్సాహంగా జరుపుకుంటారు. మహిళలు తమ కుటుంబ జీవితం సంతోషంగా ఉండాలంటూ చేసే ఈ వరలక్ష్మి వ్రతం రోజున ఈ చర్యలను అనుసరించండి. వీటిని చేయడం వలన ఇంట్లో ఎప్పుడూ ఐశ్వయర్యం తాండవిస్తుందని నమ్మిక. పంచాంగం ప్రకారం శ్రావణ శుక్రవారం ఆగస్టు 16వ తేదీన వస్తోంది. ఈ రోజున వరలక్ష్మి వ్రతాన్ని ఆచరిస్తారు. ఐశ్వర్యానికి దేవత అయిన లక్ష్మి దేవి పసుపు కొమ్ములను ఇష్టపడుతుందని నమ్ముతారు. అటువంటి పరిస్థితిలో వరలక్ష్మి వ్రతం రోజున ఉదయం స్నానం చేసి లక్ష్మి దేవిని పూజించి, లక్ష్మి దేవి పాదాల వద్ద 11 పసుపు కొమ్ములను సమర్పిస్తారు. కలశం స్థాపించిపూజ నిర్వహిస్తారు. కొంత సమయం తరువాత గవ్వలను ఎర్రటి గుడ్డలో కట్టి, వాటిని అల్మారాలో లేదా భద్రంగా ఉంచండి. ఈ పరిహారాన్ని చేయడం వల్ల సంతోషం, ఐశ్వర్యం, సంపదలు పెరుగుతాయని నమ్ముతారు. ఎవరైనా జీవితంలో ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లయితే వరలక్ష్మి వ్రతం రోజున లక్ష్మీదేవిని పూజించండని సలహా ఇస్తారు. ఈ సమయంలో, జీవితంలో ఆనందం, శాంతి కోసం ప్రార్థించడం వల్ల ఆర్థిక సమస్యలు దూరమై ఆర్థికంగా లాభపడే అవకాశాలు ఉన్నాయని నమ్ముతారు.అప్పుల బాధ నుంచి బయటపడేందుకు వరలక్ష్మి వ్రతం రోజున తీసుకునే చర్యలు మేలు చేస్తాయి. ఈ రోజున లక్ష్మీదేవిని, విష్ణుమూర్తిని నియమ నిష్టలతో పూజించి, లక్ష్మి దేవికి బియ్యం, బెల్లంతో చేసిన పాయసాన్ని నైవేద్యంగా పెడతారు. ఇలా పూజించడం ద్వారా సాధకుడు రుణ విముక్తి పొందుతాడని నమ్ముతారు. వరలక్ష్మి వ్రతాన్ని ఆచరించి లక్ష్మీదేవిని పూజించడం ద్వారా సంతానం, ఐశ్వర్యం కోరిన కోరికలు నెరవేరుతాయని విశ్వాసం. వరలక్ష్మి ఉపవాసం ఉండాలంటే ఉదయాన్నే శుభ సమయంలో ఇంట్లో శ్రీ యంత్రాన్ని ప్రతిష్టించి పూజలో పాల్గొంటారు.వరలక్ష్మి వ్రతం రోజున ముత్తయిదువులకు తాంబూలాలు ఇస్తారు. దీంతో ఆ ఇంట్లో ప్రజల కోరికలన్నీ నెరవేరి సుఖ సంతోషాలు నెలకొంటాయని విశ్వసిస్తారు.

### ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా తయారీ

విజయవాడ, ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల జాబితా సవరణ తయారీలో భాగంగా బీఎల్వోల ద్వారా ఇంటింటి ఓటర్ జాబితా సర్వే నిర్వహించాలని రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ వివేక్ యాదవ్ అన్నారు. ÷ూష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం అమరావతి నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్ఓలతో మంగళవారం సీఈవో వివేక్ యాదవ్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. నగరంలోని కలెక్టరేట్ నుండి కలెక్టర్ డా.జి. సృజన, డిఆర్వో వి. శ్రీనివాసరావు, ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం. దుర్గాప్రసాద్ హాజరయ్యారు.

## అదానీ-సెబీ బంధం దేశంలోనే అతిపెద్ద కుంభకోణం

న్యూఢిల్లీ, అదానీ-హిండెన్‌బర్గ్ వివాదం వేడెక్కుతోంది. హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా సెబీ చీఫ్ మాధబి పురి బచ్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 22న దేశవ్యాప్త నిరసనలకు కాంగ్రెస్ పార్టీ పిలుపునిచ్చింది. ఇందులో భాగంగా ఆయా రాష్ట్రాల్లోని ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయాల వద్ద నిరసనలకు దిగాలని నిర్ణయించింది. అదానీ గ్రూప్ కంపెనీలపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మంగళవారంనాడిక్కడ జరిగిన మీడియా సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ విషయాన్ని వెల్లడించారు. 'కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శులు, ఇన్‌ఛార్జులు, పీసీసీ అధ్యక్షులతో మంగళవారం సమావేశం జరిగింది. అదానీ-సెబీకి సంబంధం ఉన్న హిండెన్‌బర్గ్ వ్యవహారం దేశంలోనే అతిపెద్ద కుంభకోణంగా నిలవడంపై ప్రధానంగా చర్చించాం' అని కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఈ కుంభకోణంలో మోదీ ప్రమేయంపై ఆరోపణలు గుప్పిస్తూ, ప్రధానంగా తాము రెండు అంశాలపై దేశవ్యాప్త ఆందోళనలకు నిర్ణయించామని చెప్పారు. ప్రధాన మంత్రి పూర్తి ప్రమేయం ఉన్న అదానీ మెగా స్కామ్‌పై జేపీసీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఫైనాన్షియల్ మార్కెట్ రెగ్యులేషన్ విషయంలో పూర్తిగా మోదీ రాజీపడ్డారని ఆరోపించారు. సెబీ బాస్ రాజీనామా చేయాలనేది కూడా తమ మరో డిమాండ్ అని చెప్పారు. దేశవ్యాప్త నిరసనల్లో భాగంగా ఆయా నగరాల్లోని ఈడీ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. సెబీ చైర్‌పర్సన్ మాధబి పురి బచ్‌పై ఆగస్టు 10న హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంచలన ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ సంస్థల షేర్ల విలువను కృత్రిమంగా పెంచేందుకు వినియోగించిన మారిషస్ ఫండ్‌లలో మాధబి పురి, ఆమె భర్తకు వాటాలున్నాయని ఆరోపించింది. దీనిపై బచ్ ఘాటుగా స్పందించారు. ఇది వ్యక్తిత్వ హననమేనని అన్నారు. అదానీ గ్రూప్ సైతం హిండెన్‌బర్గ్ ఆరోపణలను కొట్టిపారేసింది. సెబీ చైర్‌పర్సన్‌తో కానీ, ఆమె భర్తతో కానీ తమకు ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవని తెలిపింది.

## తుంగభద్ర కొత్త గేటు అమర్చే ప్రక్రియ

బళ్లారి,కర్నాటకలోని తుంగభద్ర డ్యామ్‌లో కొట్టుకుపోయిన గేటు స్థానంలో తాత్కాలిక గేటు అమర్చేందుకు చర్యలు చేపట్టారు. ఇది ఇంజినీరింగ్ సాహసమేనని నిపుణులు చెబుతున్నారు. 19 నంబర్ గేటు స్థానంలో 60 అడుగుల వెడల్పు, 20 అడుగుల ఎత్తు ఉన్న భారీ గేటును అమర్చనున్నారు. ఒకవైపు నీరు వెళ్తుండగానే దీన్ని ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన పనులను జిందాల్‌తో పాటు మరో రెండు సంస్థలకు అప్పగించారు. గేటు ముక్కలను తయారు చేసి తుంగభద్ర డ్యామ్ వద్దకు తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు. మూడు సంస్థలు తయారు చేసిన గేటు ముక్కలను ప్రవాహం మీద ఉంచి అక్కడే వెల్డింగ్ చేసి అతుకులు పెట్టనున్నారు. 8 అడుగుల ఎత్తులో భారీగా వెళుతున్న ప్రవాహం మీది నుంచి నీటిని అడ్డుకుంటూ గేటును కిందికి దించనున్నారు. నిండుగా ఉన్న ప్రాజెక్టునుంచి నీరు వెళుతుండగా గేటు అమర్చడం సాహసోపేతమైన చర్యగా నిపుణులు పేర్కొంటున్నారు.

## నిండా ముంచిన కాలేజీలు..

హైదరాబాద్, స్వేచ్ఛ: తెలంగాణలోని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యాజమాన్యాల ధనదాహం నేడు వేలాదిమంది విద్యార్థుల కుటుంబాల్లో చిచ్చుపెట్టింది. ఎంసెట్‌లో మంచి రాకపోవటమో లేక కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌లోనే చేరాలనే ఆశతో అప్పోసప్పో చేసి తమ పిల్లలకు మేనేజ్‌మెంట్ కోటాలో సీటు కొని, రేపో మాపో క్లాసులకు పంపటానికి రెడీ అవుతున్న వేలాది మంది తల్లిదండ్రులకు ఆగస్టు 9న హైకోర్టు తీర్పు ఊహించని షాకిచ్చింది. సీట్ల పెంపు, తగ్గింపు అనేది కాలేజీ యాజమాన్యాలు నిర్ణయించాల్సిన విషయం కాదని, అది ప్రభుత్వం పరిధిలోని అంశమని కోర్టు అభిప్రాయపడటంతో%% లేని సీట్లనూ ముందే మేనేజ్‌మెంట్ కోటాలో దర్జాగా సీట్లు అమ్ముకుని అందినకాడికి వసూళ్లు చేసుకున్న కాలేజీల యాజమాన్యాల గొంతులో పచ్చి వెలక్కాయ పడినట్లయింది.

ప్రైవేటు కాలేజీల ప్లాన్..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో.. 35 వేల వరకు మేనేజ్‌మెంట్ సీట్లున్నాయి. అయితే.. సివిల్, మెకానికల్ బ్రాంచిలకు పెద్దగా డిమాండ్ లేకపోవటంతో కాలేజీ యాజమాన్యాలు కొత్త ప్లాన్ వేశాయి. డిమాండ్ లేని సీట్లను తగ్గించుకుని, వాటి స్థానంలో అదే సంఖ్యలో బాగా డిమాండ్ ఉండే కంప్యూటర్ సైన్స్, ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ వంటి సీట్లను పెంచుకున్నాయి. వెంటనే అమలు చేసేందుకు.. జేఎన్‌టీయూ, ఢిల్లీలోని ఏఐసీటీఈ ఆమోదం, అనుబంధ గుర్తింపు ఉన్నట్లు తీసుకున్నాయి. అయితే, కొత్త కోర్సుల్లో సీట్లు పెంచాలన్నా, తగ్గించాలన్నా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలన్న ఏఐసీటీఈ చట్టంలోని నిబంధన ప్రకారం ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలన్నీ కలిసి ప్రభుత్వానికి దరఖాస్తు చేశాయి. అయితే, ప్రభుత్వం కొత్త కోర్సుల ప్రారంభం, సీట్ల పెంపు, కుదింపు, కోర్సుల విలీనం, రద్దు కుదరదని ఉన్నత విద్యాశాఖ తేల్చి చెప్పింది. దీంతో కాలేజీల యాజమాన్యాలు హైకోర్టును ఆశ్రయించాయి.

చెక్ పెట్టిన హైకోర్టు..

ఎలాంటి కారణాలు పేర్కొనకుండా ఉన్నత విద్యాశాఖ తమ దరఖాస్తును తిరస్కరించిందని యాజమాన్యాలు కోర్టుకు నివేదించారు. కాగా, కోర్సుల్లో సీట్ల పెంపు, తగ్గింపు, విలీనం అంశాలను ప్రభుత్వం విస్తృతకోణంలో చూస్తుందని, అందుకు కాలేజీల మౌలిక వసతులు, బోధన సిబ్బంది, విద్యా ప్రమాణాలను పరిగణనలోకి తీసుకోవాలని, ప్రమాణాలున్న కొన్ని కాలేజీలకు 120 సీట్ల వరకు పెంచుకోవడానికి అనుమతించామని, అలాగే అన్ని కాలేజీలకూ వెసులుబాటు ఇవ్వలేమని ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. దీంతో కోర్టు ప్రభుత్వ వాదనను సమర్థిస్తూ తీర్పునిచ్చింది.

కొంప ముంచిన తీర్పు..

దీంతో అప్పటికే తమ ఇష్టం వచ్చినట్లుగా సీట్లు పెంచుకుని, వాటిలో మేనేజ్‌మెంట్ కోటా కింద ఉన్నవన్నీ అమ్ముకొని నిశ్చింతగా ఉన్న మేనేజ్‌మెంట్లకు ఇప్పుడేం చేయాలో పాలుపోవటం లేదు. కోర్టు తీర్పు తమకే అనుకూలంగా వస్తుందని భావించిన ప్రైవేటు కాలేజీలు ఎంసెట్ రిజల్ట్ వచ్చిన మర్నాటి నుంచే, కొన్ని కాలేజీలు ప్రత్యేకంగా పీఆర్వోలు.. ఏజెంట్లను, కన్సల్టెన్సీలను ఏర్పాటు చేసుకుని, 40 వేల ర్యాంకు కంటే తక్కువ వచ్చిన విద్యార్థులకు ఫోన్‌లు చేసి సీట్లు ఆఫర్ చేశాయి. ఆ సీట్లకున్న డిమాండ్‌ను బట్టి సొమ్ము చేసుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నాయి.

# సెబిలో 'హిండెన్‌బర్గ్' తుఫాన్

న్యూఢిల్లీ,ఒకే ఒక్క నివేదిక స్టాక్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో తుపాన్ రేపింది. అదానీ గ్రూపు కంపెనీల పునాదులను కదిలించింది. ఒక్క రోజు లోనే రూ. 87 వేల కోట్ల సంపద ఆవిరయ్యేలా చేసింది. అదే హిండెన్‌బర్గ్ రిపోర్టు. అమెరికాకు చెందిన ఫోరెన్సిక్ ఫైనాన్షియల్ రీసెర్చి కంపెనీ హిండెన్‌బర్గ్ సరిగ్గా ఏడాది క్రితం కూడా అదానీ గ్రూప్‌పై సంచలన ఆరోపణలు చేసింది. 2024 జనవరి 24 నాటికి హిండెన్‌బర్గ్ రిపోర్టు వచ్చి ఏడాది పూర్తయింది. జనవరి 24న స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి అదానీ గ్రూప్ విలువ రూ. 14.5 లక్షల కోట్లుగా ఉంది. ఈసారి విడుదలైన రిపోర్టులో అదానీ గ్రూపు వెనుక స్టాక్ మార్కెట్ అధిపతులే కీలక పాత్ర వహించడం తీవ్ర సంచలనం రేకెత్తించింది.స్టాక్ మార్కెట్ నియంత్రణ సంస్థ సెబి ఛైర్ పర్సన్ మాధాబీ పురీ బచ్‌కు అదానీ గ్రూప్‌తో ఉన్న అక్రమ ఆర్థిక లావాదేవీలు హిండెన్‌బర్గ్ బయటపెట్టింది. ఈ నివేదికపై మాధాబీ పురీ బచ్ ఇచ్చిన వివరణలతో ప్రస్తుతం కీలక ప్రశ్నలు తలెత్తుతున్నాయని, రిపోర్టులోని ముఖ్యమైన అనేక అంశాలను అంగీకరించారని హిండెన్‌బర్గ్ రీసెర్చి తన ఎక్స్ ఖాతా ద్వారా తెలియజేయడం గమనార్హం. మరోవైపు హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలు నిరాధారం అనడం విశేషం. ముఖ్యంగా గౌతమీ అదానీ సోదరుడు వినోద్ అదానీ ఆధ్వర్యంలోని ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ సంస్థల్లో పెట్టుబడులు పెట్టినట్టు మాధాబీ బచ్ కుటుంబమే అంగీకరించిందని హిండెన్‌బర్గ్ బట్టబయలు చేసింది.అదానీ గ్రూపు సంస్థల్లో పెట్టుబడుల తీరును కనిపెట్టవలసిన సెబి ఛైర్మన్ మాధాబీ పురీ బచ్‌కు ఆ గ్రూపు సంస్థల్లో వ్యక్తిగత పెట్టుబడులు, ఇతర స్పాన్సర్ల నిధులు ఉండడం విరుద్ధ అంశంగా కనిపిస్తోంది. మాధాబీ భర్త అదానీ గ్రూప్ సంస్థల డైరెక్టర్‌గా పని చేసినట్టు బయటపడింది. గౌతమీ అదానీ సోదరుడు వినోద్ అదానీకి సంబంధం ఉన్న మారిషస్ ఫండ్‌లో సెబి చీఫ్, ఆమె భర్త పెట్టుబడులు పెట్టారన్నది వాస్తవం. దీనిపై ప్రస్తుతం సెబి దర్యాప్తు జరపడం అంటే కంచే చేనుని మింగిన నానుడి గుర్తుకు రాక తప్పదు. అయితే ఈ వివరాలను మాత్రం బయటపెట్టడం లేదు. ఆ దర్యాప్తునకు సారథ్యం వహిస్తోంది ఎవరో కాదు సాక్షాత్తు మాధవీ బచియే. దర్యాప్తు సాగుతున్న సమయంలోనే ఆమె రెండుసార్లు గౌతమీ అదానీతో సమావేశమైనట్టు ఆరోపణలు వస్తున్నాయి. దర్యాప్తుపై సుప్రీం కోర్టుకు కానీ, అది నియమించిన నిపుణుల కమిటీకి కానీ సెబి ఎలాంటి వివరాలు ఇవ్వలేదు. అదానీ గ్రూపు వాటాల విలువ ఒక్కసారిగా పెరిగిపోవడంపై సెబి దర్యాప్తు జరిపింది.కానీ ఇలా ఎందుకు పెరిగిందో సెబి అసలు పరిగణనలోకి తీసుకోలేదు. ప్రాథమికంగా షార్ట్ సెల్లింగ్ కార్యకలాపాలపై మాత్రమే దర్యాప్తు జరిపింది. రాజకీయ ఒత్తిడుల కారణంగానే సెబి తన దర్యాప్తులో ఉదాసీనత వహించినట్టు విమర్శలు వస్తున్నాయి. సెబి ఛైర్ పర్సన్ కాకముందు మాధవీ బచ్ ఓ కన్సల్టెన్సీ సంస్థను



ఏర్పాటు చేశారు. అయితే దాని ఆడిటింగ్ కంపెనీ ఏ చిరునామాలో ఉందో, కన్సల్టెన్సీ సంస్థ చిరునామా కూడా అదే కావడం అనుమానాలకు దారి తీస్తోంది. కన్సల్టెన్సీ సంస్థ, దాని ఆడిటర్ మధ్య పరస్పర విరుద్ధ ప్రయోజనాలు ఉన్నాయేమోనన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. గత ఏడాది హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంస్థ షేర్ మార్కెట్‌లో అదానీ తెర వెనుక బాగోతాన్ని బయటపెట్టింది. విదేశాల్లో డొల్ల కంపెనీలు పెట్టి వాటి పేరిట డబ్బును స్వదేశంలోని తన సంస్థలకు మళ్లించడం ద్వారా షేర్ల విలువను విపరీతంగా పెంచుకున్నాడని, ఆ విధంగా తన కంపెనీలకు లేని, రాని వ్యాపార లాభాలు షేర్ మార్కెట్‌లో చూపించుకొని కృత్రిమ మార్గంలో సంపదను అత్యంత ఉన్నత స్థాయికి చేర్చుకొన్నాడనేది హిండెన్‌బర్గ్ నివేదిక బయటపెట్టిన కీలకాంశాలు.దీని తరువాత అదానీ సంస్థల షేర్లు రూ. 10 లక్షల కోట్ల వరకు నష్టపోయినట్టు సమాచారం. ఈ వ్యవహారంలో తామే దర్యాప్తు కమిటీని నియమిస్తామని, దాని వల్ల విశ్వసనీయత బలపడుతుందని ధర్మాసనం ప్రకటించింది. కానీ సెబికే దర్యాప్తు విషయంలో స్వేచ్ఛ కల్పించింది. అయితే జూన్ 3న సుప్రీం కోర్టు ఆదేశాలపై సెబి దర్యాప్తు నివేదిక సమర్పించింది. కానీ అందులో వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. ఈ దర్యాప్తు ముగింపు ఏమిటో తెలుసుకోవడం చాలా ముఖ్యం అని పేర్కొంటూ ఓ న్యాయవాది విశాల్ తివారీ సుప్రీం కోర్టుకు పిటిషన్ దాఖలు చేశారు. లోక్‌సభ 2024 ఎన్నికల ఫలితాల తరువాత షేర్ మార్కెట్ పతనం, పెట్టుబడిదారుల నష్టంపై కేంద్ర ప్రభుత్వం, సెబి వివరణాత్మక నివేదికను దాఖలు చేయాలని తివారీ కోరారు. ఈ పరిణామాలు ఎలా ఉంటాయో చెప్పలేం. కానీ అదానీ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ సంఘం (జెపిసి) వేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఈ మేరకు ఈ నెల 22న దేశవ్యాప్తంగా ప్రజా చైతన్య ఉద్యమం ధర్నాలు చేపట్టడానికి పిలుపునిచ్చింది.

# సుంకిశాల ఘటనలో సర్కారుపై విమర్శలు..!



హైదరాబాద్ : సుంకిశాల ప్రాజెక్టు రిటైనింగ్ వాల్ మునకపై రాష్ట్ర ప్రభుత్వం తీరు ఆది నుంచీ గుడ్డి దర్బార్‌ను తలపిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా బుధవారం జారీ చేసిన సస్పెన్షన్ ఉత్తర్వులతో పాటు ప్రభుత్వానికి సమర్పించిన కమిటీ నివేదికలోనూ పొరపాట్లు దొర్లినట్టు స్పష్టమవుతున్నది. సంఘటన జరిగిన రోజు అటు ఉన్నతాధికారులకుగాని, ఇటు ప్రభుత్వానికిగాని ఎలాంటి సమాచారం లేదని ప్రభుత్వమే అధికారిక ఉత్తర్వుల్లో అంగీకరించింది. ఏడో తేదీన తమ దృష్టికి వచ్చినట్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో 'అసలు ప్రభుత్వానికి ఈ విషయం తెలియకపోతే మాత్రం అది సిగ్గుచేటు' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పింది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.సంఘటన వెలుగులోకి వచ్చిన ఈ నెల 8న జలమండలి అధికారికంగా వివరణ ఇచ్చింది. అందులో ఏజెన్సీ ఇన్‌ఫ్లోను సరిగా అంచనా వేయకపోవడమే ఘటనకు ప్రధాన కారణమని పేర్కొన్నది. కానీ జలమండలి పూర్తిస్థాయి బాధ్యులను చేసిన ఏజెన్సీపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నదనే విషయంపై స్పష్టత ఇవ్వలేదు. తొలుత బోర్డు అధికారిక వాట్సాప్ గ్రూప్‌లో ఏజెన్సీకి షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు పేర్కొన్నారు. కానీ ఎలాంటి అధికారిక ఉత్తర్వులు వెలువడలేదు. దీంతో ప్రభుత్వం ఈ విషయంలో దోబూచులాడుతున్నదనే విమర్శలు వస్తున్నాయి.కమిటీ తన నివేదికలో నాగార్జునసాగర్‌కు ఒక్కసారిగా 4.90 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో గేటు కొట్టుకుపోయి, గోడ కూలిందని పేర్కొన్నట్టుగా విశ్వసనీయ సమాచారం. కానీ సంఘటన జరిగిన రెండో తేదీ ఉదయం ఆరు గంటలకు నీటిపారుదల శాఖ అధికారికంగా విడుదల చేసిన ప్రాజెక్టుల లెవల్ షీట్స్‌లో నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లో 3,36,543 క్యూసెక్కులుగా ఉన్నది. ఒకటో తేదీ సాయంత్రం ఆరు గంటలకు 3,69,866 క్యూసెక్కులుగా ఉన్నది. చివరికి ఘటన వెలుగులోకి వచ్చిన ఎనిమిదో తేదీన కూడా నాగార్జునసాగర్ ఇన్‌ఫ్లో 3,19,408 క్యూసెక్కులుగానే ఉన్నది. అంటే నాలుగు లక్షల క్యూసెక్కులు లేదు. అలాంటిది సుమారు ఐదు లక్షల క్యూసెక్కుల వరకు అంటూ ఇన్‌ఫ్లోను పెంచి చూపారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ నేపథ్యంలో ఒక్కసారిగా ఇన్‌ఫ్లో పెరగడం అనేది కాకుండా వానకాలంలో అందునా సాగర్ నీటిమట్టం పెరుగుతున్న క్రమంలో సొరంగంలో గేటు ఏర్పాటు చేసి, పనులు పూర్తి కాకముందే సొరంగాన్ని ఓపెన్ చేయడమే ఘటనకు ప్రధాన కారణమని నిపుణులు స్పష్టంచేస్తున్నారు. మరోవైపు సుంకిశాల వంటి కీలకమైన ప్రాజెక్టుల వద్ద క్షేత్రస్థాయిలో ఉండే మేనేజర్లు (ఏఈఈ) ప్రధానం. ముఖ్యంగా సివిల్ ఇంజినీర్లను నియమిస్తేనే ప్రయోజనం ఉంటుంది. కానీ బోర్డు ఉన్నతాధికారులు అక్కడ గత నెల 31వరకు విధుల్లో ఉంచిన మేనేజర్ సవేరాం సివిల్ ఇంజినీర్ కాదని, డిప్లొమా పూర్తి చేసినందున ఆయనను సూపర్‌వైజర్‌గానే పరిగణిస్తారని పలువురు ఇంజినీర్లు తెలిపారు. పైగా ఆయన హౌసింగ్‌బోర్డు నుంచి డిప్యూటేషన్‌పై జలమండలికి వచ్చారు. దీంతో పాటు ఆయన బదిలీల్లో భాగంగా వెళ్లిన తర్వాత నియమించిన, ప్రస్తుతం సస్పెన్షన్‌కు గురైన హరీశ్ కూడా సివిల్ ఇంజినీర్ కాదు. ఎలక్ట్రానిక్స్ విభాగానికి చెందిన ఇంజినీర్. అంటే బోర్డు ఉన్నతాధికారులు పనుల పర్యవేక్షణలో ఆదినుంచీ నిర్లక్ష్యంగా ఉన్నారనేందుకు ఇది మరో ఉదాహరణ అని పలువురు పేర్కొంటున్నారు.

ఇప్పుడేమంటరు భట్టిగారూ?

ఈ ఘటనపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తొలుత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెపాన్ని నెట్టేందుకు ప్రయత్నించారు. నాసిరకం పనుల వల్లే ఇలా జరిగిందని దబాయించారు. ఈ ప్రయత్నం విఫలం కావడంతో మరుసటి రోజు మంత్రుల బృందం 'ఇది చిన్న ఘటన' అని చిత్రీకరించేందుకు ప్రయత్నించింది. కాగా నాసిరకం నిర్మాణమే కారణమైతే పర్యవేక్షణ లోపం కారణంగా ఇంజినీర్లపై చర్యలెందుకు తీసుకున్నారని, ప్రభుత్వ తాజా చర్యలు భట్టి మాటలు వట్టివేనని చెప్పకనే చెప్పాయని పలువురు రాజకీయ విశ్లేషకులు స్పష్టంచేస్తున్నారు.

నలుగురు ఇంజినీర్లపై సస్పెన్షన్ వేటు

నల్గొండ జిల్లాలోని సుంకిశాల వద్ద నాగార్జునసాగర్ ఫోర్‌షోర్ నుంచి శాశ్వత ప్రాతిపదికన హైదరాబాద్ మహానగర మంచినీటి సరఫరా కోసం చేపట్టిన ప్రాజెక్టులో రిటైనింగ్ వాల్ నిలువునా కుప్పకూలిన ఘటనపై వారం పాటు గోప్యత పాటించడం రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర విమర్శలకు దారి తీసింది. ఘటన ఈ నెల రెండో తేదీన జరిగితే 'నమస్తే తెలంగాణ' ఎనిమిదో తేదీ ఎడిషన్ ద్వారా వెలుగులోకి తెచ్చింది. దీంతో ఘటన వివరాలు, వీడియో ఒక్కసారిగా సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారడంతో రాష్ట్ర ప్రభుత్వం ఉలిక్కిపడింది. జలమండలిలోని ముగ్గురు ఇంజినీర్లతో వేసిన త్రిసభ్య కమిటీ నివేదికను సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన నుంచి వచ్చిన రోజే పురపాలక శాఖ అందించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలకు ఉపక్రమించింది. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు జలమండలిలోని నలుగురు ఇంజినీర్లపై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. త్రిసభ్య కమిటీ నివేదిక ఆధారంగానే చర్యలు తీసుకున్నట్టుగా స్పష్టం చేసింది. పాజెక్టు డివిజన్ సర్కిల్-3 (సుంకిశాల)లో పనిచేస్తున్న సీజీఎం ఎస్. కిరణ్‌కుమార్, జీఎం బీ మరియరాజ్, డీజీఎం ఎన్ ప్రశాంత్, మేనేజర్ కేవీపీ హరీశ్‌ను సస్పెండ్ చేస్తూ పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రాజెక్టు డైరెక్టర్ సుదర్శన్‌ను ప్రాధాన్యత లేని పోస్టుకు బదిలీ చేశారు. టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్‌కు ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్ బాధ్యతలు అప్పగించారు. ఘటన వెలుగులోకి వచ్చాక సంబంధిత ఇంజినీర్లను ఎండీ అశోక్‌రెడ్డి వివరణ కోరగా వారి సమాధానం సంతృప్తికరంగా లేకపోవడం, ఇంజినీర్ల సాంకేతిక పర్యవేక్షణ లోపాన్ని కమిటీ ఎత్తిచూపినందున ఈ చర్యలు తీసుకున్నట్టు ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. జలమండలిలో ఏకకాలంలో నలుగురు ఇంజినీర్లపై ఒకేసారి వేటు పడటం బోర్డులో భారీ కుదుపునకు దారితీసింది.

## పోస్టింగ్ ఇవ్వని ఐపిఎస్‌లకు మెమోలు

అమరావతి, ఏపీలో వెయిటింగ్‌లో ఉన్న ఐపీఎస్ అధికారులు రోజూ హెడ్ క్వార్టర్లలో రిపోర్టు చేయాలని డీజీపీ ఆదేశించారు. వెయిటింగ్‌లో ఉంటూ అందుబాటులో ఉండని సీనియర్ ఐపీఎస్‌లకు డీజీపీ ద్వారకా తిరుమలరావు మెమోలు జారీ చేశారు. వెయిటింగ్‌లో ఉండి హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో లేనివారికి మెమోలు ఇచ్చారు. ప్రస్తుతం వెయిటింగ్‌లో ఉన్న డీజీ ర్యాంకు అధికారులు పీఎస్సార్ ఆంజనేయులు, సునీల్ కుమార్ సహా 16 మంది ఐపీఎస్ అధికారులకు మెమో జారీ అయ్యాయి. వెయిటింగ్ లో సీఐడీ మాజీ చీఫ్ సంజయ్, విజయవాడ మాజీ సీపీ కాంతి రాణా టాటా, కొల్లి రఘురామిరెడ్డి, అమ్మిరెడ్డి, విజయరావు, విశాల్ గున్ని, రవిశంకర్ రెడ్డి, రిషాంత్ రెడ్డి, రఘువీరా రెడ్డి, పరమేశ్వర్ రెడ్డి, జాషువా, కృష్ణ కాంత్ పటేల్, పాలరాజులకు డీజీపీ మెమో జారీ చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు డీజీపీ ఆఫీసులోనే ఉండాలని ఆదేశించారు. విధులు ముగిశాక అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసి వెళ్లాలని డీజీపీ స్పష్టం చేశారు.

## దత్తత పేరుతో మనవడిని అమ్మేసిన నాయనమ్మ

ఖమ్మం,మనవడు, మనవరాల్లు అంటే అందరికీ మక్కువ ఎక్కువ. వారిని ఎంతో గారాబంగా చూసుకుంటారు. కానీ ఇక్కడ మాత్రం ఓ నానమ్మ... మనవడు అన్న కనికరం లేకుండా అమ్మకానికి పెట్టేసింది. ఖమ్మం జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. జిల్లాలోని రఘునాథ పాలెంలో సొంత మనవడినే అమ్మేసింది నాయనమ్మ. మనవడిని దత్తత పేరుతో హై డ్రామాకు తెరతీసింది. ఖమ్మంలో ఓ కార్పొరేటర్ భర్త సహకారంతో హైదారాబాద్‌వాసికి దాదాపు రూ. 5 లక్షలకు అమ్మకానికి పెట్టేసింది.ప్రేమ వివాహం చేసుకున్న కొడుకు సాయి 2023లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అయితే అప్పటికే సాయికి ఓ కొడుకు ఉన్నాయి. కొడుకు చనిపోయినా మనవడు ఉన్నాడని మురిసిపోకుండా సదరు నాయనమ్మ వాడిని అమ్మేసింది. దత్తత తరువాత 5లక్షలకి చిన్నారిని అమ్మేసిందంటూ కోడలు స్వప్న పోలీసులను ఆశ్రయించింది. రఘునాథ పాలెంకి చెందిన పందుల సాయి ఖమ్మం నగరంలో నిజాంపేటకు చెందిన కొమ్మినబోయిన స్వప్న 2021 డిసెంబరులో ప్రేమ వివాహం చేసుకున్నారు. అయితే బాబు పుట్టిన నెల రోజులకే 2023 లో సాయి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ క్రమంలో 42 వ డివిజన్ కార్పోరేటర్ భర్త శేషగిరితో కలిసి అత్త నాగమణి తన కోడలి వద్ద నుంచి బాబును పెంచుకుంటానని తీసుకెళ్లింది. 45 రోజులకే దత్తత పేరుతో బాబును అమ్మకానికి పెట్టింది. అయితే బాబు కోసం స్వప్న ఎంతాగానో తపించింది. తన బాబును తనకు ఇవ్వమంటూ కార్పొరేటర్ భర్త చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని స్వప్న ఆవేదన వ్యక్తం చేసింది. బాబును ఇవ్వమంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. 'నా కుమారుడిని నాకు ఇప్పించండి' అంటూ సీసీఎస్ పోలీసులను స్వప్న ఆశ్రయించింది. కేసు నమోదు చేసి సీపీఎస్ పోలీసులు ముమ్మరంగా దర్యాప్తును ప్రారంభించారు.

## నాగోలు మెట్రోలో పార్కింగ్ దందా

హైదరాబాద్, మెట్రో స్టేషన్ల వద్ద కొన్ని చోట్ల ఉన్న ఉచిత వాహనాల పార్కింగ్‌ను ఉన్నట్టుండి పెయిడ్ చేయడం వివాదానికి దారి తీసింది. గురువారం నాగోల్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న పార్కింగ్ స్థలంలో నిర్వాహకులు పెయిడ్ పార్కింగ్ అని చెప్పడంతో అది పెద్ద వివాదానికి దారి తీసింది. చాలా సేపు వాహనదారులకు నిర్వాహకులకు మధ్య ఘర్షణ చెలరేగింది. చాలా ఏళ్లుగా మెట్రో ప్రయాణికులు తమ వాహనాలను ఆ స్థలంలో ఫ్రీగా పార్కింగ్ చేసుకుంటున్నారు. కానీ, గురువారం నుంచి నిర్వాహకులు పెయిడ్ అని చెప్పడంతో వాహనదారుల నుంచి విపరీతమైన వ్యతిరేకత ఎదురైంది. పైగా ఒక ప్రత్యేకమైన యాప్ డౌన్ లోడ్ చేసుకొని, దాని ద్వారా చెల్లింపులు చేయాలని సూచించారు. ఒకేసారి టూ వీలర్ కు రూ.40 వరకూ వసూలు చేస్తున్నారు. అది కూడా 'పార్క్ హైదరాబాద్' అనే యాప్ నుంచి చేయాలని కండీషన్ పెట్టారు. ఆ యాప్ గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్ లోడ్ కావడం లేదని వాహనదారులు చెబుతున్నారు. అసలే ఆఫీసులకు వెళ్లే తొందరలో ఉన్న వారిని ఈ పార్కింగ్ సమస్య తీవ్ర ఇబ్బందులకు గురి చేసింది. నగదు చెల్లించి పార్కింగ్ చేసేందుకు కూడా నిర్వాహకులు అనుమతించకపోవడంతో చాలా మంది వాహనదారులు వారిపై తిరగబడాల్సి వచ్చింది. నిర్వాహకులు మాత్రం సదరు యాప్ డౌన్ లోడ్ చేసుకొని, అక్కడ ఉన్న క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేసి మాత్రమే పార్కింగ్ చేయాలని చెబుతున్నారు. నిన్నటి వరకూ ఇక్కడ ఎలాంటి పార్కింగ్ ఫీజును వసూలు చేయకుండా.. ఇప్పుడు ఉన్నట్టుండి ఇలా చేయడం పట్ల వాహనదారులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

## బ్రేకు వేస్తున్నదెవరో తెలిస్తే షాకే?

అమరావతి,తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉంది. కూటమి కట్టి పోటీ చేసినా సొంతంగా 135 సీట్లు దక్కాయి. అయిదేళ్ళ పాటు అద్భుతమైన రాజకీయ భవిష్యత్తు ఆ పార్టీలో ఉంటుంది. అంతే కాదు నారా లోకేష్ వంటి యువ నాయకత్వం అందుబాటులోకి వచ్చింది. దాంతో టీడీపీ మరిన్ని కాలాల పాటు ఏపీ రాజకీయాల్లో కీలక భూమిక పోషించడం ఖాయమన్నది కూడా కనిపిస్తున్న సత్యం.అటువంటి టీడీపీలో చేరేందుకు ఉరుకులు పరుగులు పెడుతున్న నాయకులు అనేకమంది ఉన్నారు. ఈ మధ్యనే మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఒక మాట అన్నారు. తాము గేట్లు తెలిస్తే వైసీపీ గల్లంతు కావడం ఖాయమని. ఆ మాట నిజమే కూడా. ఇప్పటికే చాలా జిల్లాల నుంచి వైసీపీ నేతలు అధికార పార్టీలోకి దూకుతామని చూస్తున్నారు వారు టీడీపీ నేతల ద్వారా రాయబారాలు నడుపుతున్నారు.అయితే అలాంటి వారికి చుక్కెదురు అవుతోందిట. పసుపు పార్టీలో ప్రవేశించడం ఈసారి అంత ఈజీ కాదు అని అంటున్నారు. 2014 నుంచి 2019 మధ్యలో అనేక మంది వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. ఈసారి కూడా అలాగే అవుతుంది అని అనుకున్నా టీడీపీలో చేరికలు పెద్ద బ్రేకే పడిపోయింది అని అంటున్నారు. ఆ బ్రేకులను వేసిన వారు ఎవరో తెలిస్తే షాక్ తినాల్సిందే.ఆయన ఎవరో కాదు చంద్రబాబు తరువాత టీడీపీలో పార్టీ పగ్గాలు అందుకునే నారా లోకేష్. నారా లోకేష్ చూస్తే రాజకీయంగా రాటు తేలారు. ఆయన 2014 నుంచి 2019 మధ్యలో కనిపించిన నేత అయితే కాదు. ఆనాడు ఆయన కొంత అనుభవ రాహిత్యంతో మీడియాకు మేత అయ్యేవారు. కానీ అయిదేళ్ల ప్రతిపక్ష పాత్ర ఆయనను సరైన లీడర్ గా చేసింది. ముఖ్యంగా యువగళం పాదయాత్ర లోకేష్ లో చెప్పలేని మార్పుని తెచ్చింది.అందుకే లోకేష్ మంత్రిగా కీలకంగా ఉన్నా తన పని తాను చేసుకుంటూ పోతున్నారు. పూర్తిగా లో ప్రొఫైల్ ని మెయిన్ టెయిన్ చేస్తున్నారు ఎక్కడా ఆయన బయటకు అనవసర కామెంట్స్ చేయడం లేదు. ఆయన పని తాను చేసుకుంటూ ప్రజా సమస్యల మీద దృష్టి పెడుతున్నారు. ఆయన ఉదయాన్నే తన నివాసం వద్ద ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నారు. అక్కడ ప్రజల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి మార్గాలు వెంటనే వెతుకుతున్నారు.దాంతో లోకేష్ ప్రజా దర్బార్ కి మంచి స్పందన లభిస్తోంది. అలాగే శాఖాపరంగా పట్టుని పెంచుకుంటున్నారు. అంతే కాకుండా ఆయన టీడీపీ మీద పూర్తిగా దృష్టి పెడుతున్నారు. వైసీపీ హయాంలో పార్టీలో క్యాడర్ ఇబ్బంది పడింది.అటువంటి వారి వివరాలు అన్నీ ఆయన దగ్గర ఉన్నాయి. దాంతో గత వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ క్యాడర్ ని వేధించిన వారిని ఆయన అసలు వదలడం లేదు. సైలెంట్ గానే పోలీసులకు ఆ వివరాలు ఇచ్చి పని కానిచ్చేస్తున్నారు అని అంటున్నారు. అలా క్యాడర్ ని ఆయన కాపాడుకుంటూ వారిలో ఆత్మ విశ్వాసం పెంచుతున్నారు.ఇక ఇదే సమయంలో టీడీపీలోకి వస్తామని చెబుతున్న నాయకులను ఆయన ఎక్కడా తీసుకోవడం లేదు అని అంటున్నారు. ఎంతటి బడా లీడర్ అయినా అధికారంలో ఉంది కాబట్టి వచ్చి చేరుతామంటే వద్దు అని చెప్పేస్తున్నారు. అలా చేరడానికి కలవాలని అపాయింట్మెంట్లు కోరినా ఇవ్వడంలేదు అని అంటున్నారు. ఇంకో వైపు చూస్తే లోకేష్ 2029 నాటికి టీడీపీని పూర్తిగా తనదైన పద్ధతిలో మార్చాలని చూస్తున్నారు.

# ఇంకెన్నాళ్లీ ఆర్థిక అసమానతలు




న్యూఢిల్లీ,దేశంలో వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయలేనంత కాలం ఈ దేశం ఆర్థికంగా పురోగమించదని నిపుణులు పదేపదే సూచిస్తున్నా..అందుకు అనుగుణంగా అడుగులు వేయడం లేదు. దేశ జనాభాకు అనుగుణంగా అవసరమైన పంటలను ప్రోత్సహించాలి. వ్యవసాయ దిగుబడులను తగ్గించి, ఎగుమతులను పెంచుకోవాలి. వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించాలన్న సూచనలు పెడచెవిన పెడుతున్నారు. నదుల అనుసంధానం జరగడం లేదు. పూర్తి విద్యుత్ ఉత్పత్తి దిశగా పెట్టబడులు రావడం లేదు. మన దేశం అభివృద్ధి సాధించాలంటే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉండాలని గత ఫిబ్రవరి 27న మహారాష్ట్రలోని యవత్మాల్‌లో మోడీ ప్రకటించారు. అధికారంలోకి వచ్చిన కొత్తలో వ్యవసాయాన్ని అభివృద్ధి చేసి, రైతుల ఆదాయాన్ని రెండింతలు చేస్తానన్న మోడీ హామీ పదేళ్లయినా అమలు కావడం లేదు. దేశ జనాభాలో 60 శాతం మందికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. అయినా ఈ రంగాన్ని పైకి తీసుకుని రావడం, వ్యవసాయాధారిత పరిశ్రమలను ప్రోత్సహించడం జరగడం లేదు. పప్పుల ధరలు పెరుగుతున్నా, మనదేశంలో పప్పు పంటలను ప్రోత్సహించడం లేదు. నూనె ధరలు పెరుగుతున్నా, నూనెగింజల పంటలకు ప్రోత్సాహం దక్కడం లేదు. 2018-19 నాడు 7.8 శాతం అభివృద్ధితో వున్న వ్యవసాయరంగం 2024 మార్చి నాటికి 0.6 శాతానికి పడిపోయింది. వేగంగా దిగజారిపోతున్న వ్యవసాయ రంగాన్ని ఆదుకోవలసి వుంది. కానీ అలాంటి ప్రయత్నాలు జరగడం లేదు. అంతెందుకు ఇటీవల నిర్మలా సీతారామన్ ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ఎరువుల సబ్సిడీకి గత సంవత్సరం కంటే రూ.24,894 కోట్లు, ఆహార సబ్సిడీకి రూ.7,082 కోట్లు తగ్గించేశారు. రానున్న రోజుల్లో ఎరువులు, పురుగు మందుల ధరలు మరింతగా పెరుగుతాయి. పంటల పెట్టుబడి సహాయం పెంచకుండా, కనీస మద్దతు ధర, ఉచిత బీమా అమలు చేయకుండా వ్యవసాయ సంక్షోభాన్ని బిజెపి ప్రభుత్వం మరింత తీవ్రం చేస్తున్నది. ఆహార సబ్సిడీ తగ్గించడంతో పేదలకు అందుతున్న రేషన్ సరుకుల కోటా తగ్గిపోతుంది. ఆకలి కేకలు పెరుగుతాయి. వ్యవసాయ కూలీలకు, పేద రైతులకు కొంత ఊరటనిస్తున్న గ్రామీణ ఉపాధి హామీ పథకానికి ఈ బడ్జెట్‌లో కేటాయించిన రూ.86 వేల కోట్లలో, ఇప్పటికే చేసిన పనులకు చెల్లించాల్సిన బకాయిలు రూ.41,500 కోట్లు పోను, మిగిలింది కేవలం రూ. 44,500 కోట్లు. ఇంత తక్కువ డబ్బుతో కోట్ల మంది పేదలకు పనులు ఎలా కల్పిస్తారన్నది అర్థం కావడం లేదు. అన్నింటికి మించి ఉపాధి పనులను వ్యవసాయానికి అనుబంధించాలన్న డిమాండ్ పట్టించుకోవడం లేదు. దేశంలో వ్యవసాయ కూలీలు దొరకడం లేదు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు దక్కడం లేదు. అలాగే సామాన్యులకు తిండిగింజలు దొరకడం లేదు. అధిక ధరలతో సామాన్యులు ఉప్పులు, పప్పులు కొనుక్కోలేక పోతున్నారు. ఈ సమస్యలను పార్లమెంటు చర్చించదు. బయటా చర్చించం లేదు. దేశంలో నిరుద్యోగ తీవ్రత చాలా ఎక్కువగా వుంది. దేశంలో పని చేయగలిగిన శ్రామికుల సంఖ్య 64 శాతానికి పెరిగిందని, కేవలం 37 శాతం మందికి మాత్రమే పనులు దొరికాయని ఓ నివేదిక తెలిపింది. యువతకు ఉపాధి కల్పించడం దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాల్‌గా మారింది. సాంకేతిక పరిజ్ఞానం, కృత్రిమ మేధ ప్రభావంతో నిరుద్యోగం మరింత తీవ్రం కానుంది. ఐటి సేవల రంగాలలో తక్కువ నైపుణ్యం ఉంటే చాలన్న రీతిలో సాగుతోంది. ఐటి కంపెనీలు కూడా ఉద్యోగులను ఉన్న పళంగా తీసేస్తున్నాయి. ఈ క్రమంలో వ్యవసాయానుబంధ రంగాలను బలోపేతం చేయడం మినహా మరో గత్యంతరం లేదు. అయినా ఇటువైపు పాలకులు దృష్టి సారించడం లేదు. ప్రధాని మోడీ చెబుతున్నట్లుగా 2047 నాటికి దేశం సమగ్రంగా అభివృద్ధి చెందాలంటే విద్యారంగం, వ్యవసాయరంగం కీలకమని నిపుణులు సూచిస్తున్నారు. అత్యధిక అక్షరాస్యత వున్న కేరళ తలసరి ఆదాయం దేశంలో మొదటి స్థానంలో వుంది. తర్వాత స్థానాల్లో తమిళనాడు, తెలంగాణ వున్నాయి. బీహార్ తలసరి ఆదాయం అతి తక్కువగా వుండడానికి అక్షరాస్యత కూడా ముఖ్య కారణమన్నారు. ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, గ్రామీణాభివృద్ధి రంగాలన్నింటికి నిధుల కేటాయింపులు తగ్గిపోతున్నాయి. మేక్ ఇన్ ఇండియా, మేడ్ ఇన్ ఇండియా నినాదాలను రాజకీయ ప్రచారం కోసం వాడుకుంటున్నారు. ప్రపంచీకరణ ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ సేవలు కుదించుకుపోయాయి. పేద, మధ్య తరగతి వారికి వచ్చే అరకొర ఆదాయం నుండి విద్య, వైద్యానికి చేసే ఖర్చులు పెరిగిపోయాయి. ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలు ప్రజల జీవితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి.ఆర్థిక అంతరాలను తగ్గించడానికి సంపన్నుల మీద పన్నులు వేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. పేదరికం లేని సమాజం కోసం ప్రణాళికలు అమలు చేయడం లేదు. వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురి కావడంతో ఆహారభద్రత కూడా లేకుండా పోతున్నది. ఈ క్రమంలో వ్యవసాయాన్ని బలోపేతం చేస్తు తప్ప దేశం ఆర్థికంగా అభివృద్ధి సాధించలేదు.

# గంజాయిపై ఉక్కుపాదం...

హైదరాబాద్,ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గంజాయి, డ్రగ్స్‌పై ఉక్కపాదం మోపుతున్నారు. ఎక్కడా గంజాయి అన్న పదం వినిపించకుండా దాడులు సాగిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణలో గంజాయి, డ్రగ్స్‌పై దాడులు పెరిగాయి. కూపీ లాగుతూ భారీ మొత్తంలో గంజాయి పట్టుకుంటున్నారు. డ్రగ్స్ విక్రేతలను కూడా పట్టుకుంటున్నారు. ఇదే క్రమంలో ఎపిలో కూడా గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నారు. దీంతో రవాణా చేయాలంటే భయపడేలా చేస్తున్నారు. అన్నింటిక ఇమించి తెలంగాణలో ఎసిబి అవినీతిపరుల భరతం పడుతోంది. లంచావతారులను టార్గెట్ చేస్తోంది. అన్ని శాఖలల్లో అవినీతిపరులపై ఏసీబీ దృష్టిసారించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు 105 కేసులు నమోదు అయ్యాయి. వీటిలో రెడ్ హ్యాండెడ్ గా దొరికిన కేసులే అధికంగా ఉన్నాయి. కోట్ల రూపాయల ఆస్తులు సంపాదిస్తున్న అధికారులపై అధికారులు నిఘా పెట్టారు. సోదాలు చేసి కేసులు నమోదు చేయడంతో పాటు అవినీతి సొమ్మును సీజ్ చేస్తున్నారు. పది రోజుల వ్యవధిలో ఆరు కేసులను ఏసీబీ నమోదు చేసింది. రెవెన్యూ, మున్సిపల్, పోలీస్, రిజిస్ట్రేషన్, ఎక్సైజ్ శాఖలో ఎక్కువ అవినీతి జరిగినట్లు గుర్తించారు. శివబాలకృష్ణతో మొదలయిన దాడులు రంగారెడ్డి జిల్లా జాయింట్ కలెక్టర్ వరకు కొనసాగుతూనే ఉన్నాయి. దీనికితోడు ఏసీబీ నుంచి అవినీతిపరులు తప్పించుకోలేరంటూ ఏసీబీ డీజీ సీవీ ఆనంద్ హెచ్చరికలు జారీ చేశారు. రంగారెడ్డి అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డి ఎనిమిది లక్షలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. అలాగే నిజామాబాద్ మున్సిపల్ సూపర్నెంట్ దాసరి నరేంద్రపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసు నమోదు అయ్యింది. నరేంద్ర ఇంట్లో రూ.2.93 కోట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సంగారెడ్డి సీసీఎస్ పనిచేస్తున్న సీఐ వెంకట కిషోర్‌పై కూడా ఏసీబీ అధికారులు కేసు నమోదు చేశారు.నిషేధిత జాబితా నుంచి భూమిని తొలగించేందుకు లంచం తీసుకుంటుండగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి దొరికిపోయారు. లంచం డబ్బులు తీసుకోవాలంటూ జూనియర్ అధికారిని పురమాయించడం ద్వారా ఆ అధికారి అత్యంత చాకచక్యంగా వ్యవహరిస్తే.. ఏసీబీ అధికారులు అంతకుమించి చాకచక్యంగా వ్యవహరించి ఆయన్ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ మేరకు భూపాల్‌రెడ్డితో పాటు కలెక్టరేట్ ఈ-సెక్షన్ అధికారి మదన్ మోహన్‌రెడ్డి కూడా పట్టుబడ్డారు. హైదరాబాద్ నగర శివార్లలోని గుర్రంగూడకు చెందిన జక్కిడి ముత్యంరెడ్డికి చెందిన 14 గుంటల భూమి ధరణిలో నిషేధిత జాబితాలో ఉంది. దీన్ని ఆ జాబితా నుంచి తొలగించాలంటూ పలుమార్లు రెవెన్యూ అధికారులకు ముత్యంరెడ్డి వినతి పత్రం ఇచ్చాడు. పని అవ్వకపోవడంతో ముత్యంరెడ్డి ఈ-సెక్షన్ అధికారి మదన్ మోహన్‌రెడ్డిని కలవగా ఆయన పెద్ద మొత్తంలో లంచం డిమాండ్ చేశారు. చివరకు రూ. 8 లక్షలకు ఒప్పందం కుదిరింది. అయితే ఈ లంచం వ్యవహారం గురించి ముత్యంరెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం రాత్రి మదన్ మోహన్‌ను ముత్యంరెడ్డి కలిసి ఆ డబ్బు ఇచ్చారు. అప్పటికే అక్కడ మాటు వేసిన ఏసీబీ అధికారులు.. మదన్ మోహన్‌ను రెడ్



హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అయితే అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి చెబితేనే తాను డబ్బులు తీసుకున్నట్లు ఏసీబీ అధికారులకు మదన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. మదన్‌మోహన్ వెంటనే భూపాల్‌రెడ్డికి తన ఫోన్ నుంచి కాల్ చేశారు. గుర్రంగూడ భూమికి సంబంధించిన విషయంలో డబ్బు చేతికి అందిందని చెప్పగానే ఆ డబ్బు తీసుకుని పెద్ద అంబర్‌పేట్ ఓఆర్ఆర్ వద్దకు రావాలని భూపాల్‌రెడ్డి సూచించారు. వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. మదన్‌మోహన్‌ను కారులో డబ్బుతో వెళ్లాలని ఆదేశించి.. ఆ వాహనాన్ని తమ కారులో అనుసరించారు. చెప్పిన చోటుకు వెళ్లి, అక్కడ రూ.8 లక్షలు అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డికి మదన్‌మోహన్ ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. అక్కడి నుంచి భూపాల్‌రెడ్డి, మదన్‌మోహన్‌ను అర్ధరాత్రి కలెక్టరేట్‌కు తరలించారు. అలాగే మున్సిపల్ కార్పొరేషన్‌లో అవినీతి తిమింగాలన్ని ఏసీబీ అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే. ఆదాయానికి మించి ఆస్తులున్నాయన్న సమాచారంతో నిజామాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ సూపరింటెండెంట్ దాసరి నరేందర్ నివాసంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. దాసరి నరేందర్ ఇంటితో పాటు ఆయన కార్యాలయం, బంధువుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. ఉదయం 5 గంటలకు మొదలైన సోదాలు అర్ధరాత్రి దాటినా కొనసాగాయి. హైదరాబాద్ నుంచి వచ్చిన 25 మంది ఏసీబీ అధికారులు నాలుగు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేశారు. తనిఖీల్లో భాగంగా దాదాపు రూ.3 కోట్ల నగదు (ను స్వాధీనం చేసుకున్నారు. ఇంకా ఆయన బ్యాంకు ఖాతాలో రూ.1.10 కోట్లు ఉన్నట్లు గుర్తించారు. వీటితో పాటు నరేందర్ ఇంట్లో ఉన్న 51తులాల బంగారం, 17 స్థిరాస్తులకు సంబంధించిన పత్రాలను సీజ్ చేశారు. నరేందర్ ఆఫీసులో రూ.90వేలు దొరికాయి. అధికారులు సీజ్ చేసిన నగదు, బంగారం, ఆస్తి పత్రాల విలువరూ.6,07,81,000. ఒక సూపరింటెండెంట్ ఇంట్లో ఇంత పెద్ద మొత్తంలో నగదు దొరకడంతో అధికారులు ఆశ్చర్యపోయారు. నోట్లను లెక్క పెట్టడానికి రెండు కౌంటింగ్ మిషన్లను ఉపయోగించారు. నిజామాబాద్ జిల్లాలో ఓ ప్రభుత్వ ఉద్యోగి ఇంట్లో ఇంత భారీ స్థాయిలో నగదు పట్టుబడటం ఇదే మొదటిసారని అధికారులు తెలిపారు. అవినీతికి పాల్పడిన నరేందర్‌ను అరెస్టు చేశారు.


# రిజర్వాయర్ లో చేపల వేట నిషేధం..

కర్నూలు : శ్రీశైలం జలాశయ పరిసరాల్లో చేపల వేటపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది.ఈ మేరకు మత్స్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జులై, ఆగస్టులో చేపల సహజ సంతానోత్పత్తి సమయమని, ఈ సమయంలో శ్రీశైలం జలాశయం, బ్యాక్‌వాటర్స్‌లో చేపల వేట వద్దని ఆదేశించింది.శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నీటి విడుదల ఆగిపోవటంతో మత్స్యకారులు పుట్టీలపై బయలుదేరి చేపలు వేటాడుతున్నారు. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం నిలిచిపోవటంతో సోమవారం ప్రాజెక్టు గేట్లన్నీ మూసివేశారు. దీంతో డ్యాం దిగువన ఉన్న ప్లంజ్‌పూల్‌లో చేపలను పట్టుకునేందుకు కృష్ణాతీరంలోని పాతాళగంగ, లింగాలగట్టు గ్రామాల్లోని మత్స్యకారులు పుట్టీలపై బయలుదేరారు. ప్రాజెక్టు నుంచి దూకుతున్న నీటికి ఎదురెళ్లే పెద్ద చేపలు డ్యాం దిగువన ప్లంజ్‌పూల్‌లోకి చేరతాయి. వీటి కోసమే మత్స్యకారులు వలలతో వేట సాగిస్తున్నారు. ఈ



నేపథ్యంలో మత్స్యశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

# జగన్ మీద నల్లేరులా దూసుకువస్తున్న నల్లారి !



అమరావతి,వైసీపీ అధినేత జగన్ కి మాజీ సీఎం నల్లారి కిరణ్ కుమార్ రెడ్డికి మధ్య రాజకీయ యుద్ధం ఉమ్మడి ఏపీలో జరిగిన సంగతి తెలిసిందే. జగన్ కాంగ్రెస్ పార్టీని వీడి పోవడానికి ఒక రకంగా నల్లారి కారణం అని చెబుతారు. రోశయ్య సీఎం గా ఉన్నా జగన్ ఎలాగోలా సర్దుకున్నారు. కానీ పదకొండు నెలలకే రోశయ్యను పక్కన పెట్టించేలా నల్లారి వారు ఢిల్లీ స్థాయిలో వేసిన వ్యూహాలు పారడంతో పెద్దాయన మాజీ సీఎం అయ్యారు. నల్లారి హ్యాపీగా సీఎం పీఠం అధిరోహించారు.నల్లారి అలా మూడేళ్ళకు పైగా ఉమ్మడి ఏపీని ఏలిన సీఎం గా చివరి సీఎం గా చరిత్ర సృష్టించారు. అప్పట్లో నల్లారికి కాంగ్రెస్ అధినాయకత్వం ఇచ్చిన టాస్క్ ఏంటి అంటే జగన్ ని కట్టడి చేయడం. దాని కోసం ఆయన చేయని ప్రయత్నం లేదు. అదే క్రమంలో చిత్తూరు జిల్లాలో బద్ధ శత్రువులుగా దశాబ్దాల నాటి నుంచి ఉన్న చంద్రబాబు నల్లారి కుటుంబాలు కూడా కలసి రాజకీయం చేశాయి. జగన్ మీదకు ఉమ్మడిగానే ఎత్తులు వేసి మరీ అరెస్ట్ దాకా కథను నడిపించాయి.ఇక విభజన ఏపీలో నల్లారి పాత్ర ఏమీ లేదు. ఆయన కాంగ్రెస్ ని వీడి సమైక్యాంధ్ర పార్టీ పెట్టారు. 2014లో ఆ పార్టీ ఓటమితో ఆయన తెర మరుగు అయ్యారు. మళ్లీ కాంగ్రెస్ లో చేరారు. 2019 తరువాత కాంగ్రెస్ ని వీడి బీజేపీలో చేరారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాజంపేట నుంచి బీజేపీ తరపున పోటీ చేసి ఎనభై వేల ఓట్ల తేడాటో ఓటమి పాలు అయ్యారు.ఓడిన రెండున్నర నెలల తరువాత నల్లారి వారు మళ్లీ జనంలోకి తాజాగా వచ్చారు. వస్తూనే ఆయన జగన్ ని గట్టిగా టార్గెట్ చేశారు అనంతపురం లో జరిగిన బీజేపీ నేతల సమావేశంలో జగన్ మీద నల్లారి తీవ్ర విమర్శలే చేశారు. సొంత బాబాయ్ హత్య కేసునే పట్టించుకోని జగన్ ఏపీ ప్రజలను ఎందుకు పట్టించుకుంటారు అని ప్రశ్నించారు.అయిదేళ్ల పాటు అరాచక పాలన సాగించిన జగన్ ని ప్రజలు ఎప్పటికీ మరచిపోరని అన్నారు. కొత్త జిల్లాల వల్ల ప్రయోజనం శూన్యం అని ఇది దండగమారి వ్యవహారం అని జగన్ మీద ధ్వజమెత్తారు. తానే కనుక సీఎం అయి ఉంటే పాత జిల్లాలనే ఏపీలో కొనసాగించేవాడిని అని ఆయన అన్నారు.జగన్ నిర్లక్ష్య పూరితమైన పాలన వల్ల ఏపీ ప్రజలు పూఅర్తిగా నష్టపోయారు అని నల్లారి వారు ఘాటైన విమర్శలే చేశారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితులు ఎక్కడా తప్పించుకోలేరని వారికి తగిన శిక్ష పడుతుందని కూడా స్పష్టం చేశారు.ఒక వైపు జగన్ని విమర్శిస్తూనే మరో వైపు చంద్రబాబు మీద ప్రశంసల వర్షం కురిపించారు. బాబు సమర్ధుడైన నాయకుడు అని కితాబు ఇచ్చారు. బాబు పాలనలో పోలవరం పూర్తి అవుతుందని అలా ఆయన చరిత్రలో నిలిచిపోతారు అని అన్నారు. అమరావతి పోలవరం పూర్తి కావడానికి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తుందని కూడా నల్లారి కిరణ్ చెప్పారు.పోలవరం పూర్తి అయితే రాయలసీమ జిల్లాల రైతాంగానికి కూడా ఎనలేని మేలు జరుగుతుందని ఆయన చెప్పారు. అయిదేళ్ళ వైసీపీ పాలన ప్రజలకు ఒక షాక్ వంటిది అని కిరణ్ అభివర్ణించారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతోనే ఏపీ మెల్లగా కోలుకుంటోదని ఏపీ అభివృద్ధి పథంలో పయనించడం ఖాయమని అన్నారు.ఇదిలా ఉంటే కిరణ్ కుమార్ రెడ్డి సడెన్ గా జనంలోకి రావడమే కాదు జగన్ ని టార్గెట్ చేయడం వెనక భారీ వ్యూహాలే ఉన్నాయని అంటున్నారు ఆయన ఎక్కడో హైదరాబాద్ లోనే ఉంటారు ఎపుడూ ఏపీకి రారు అని విమర్శలు ఉన్నాయి.అలా కాకుండా జనంతో టచ్ లో ఉంటే కేంద్రంలో ఎటూ బీజేపీ అధికారంలో ఉంది కాబట్టి రాజ్యసభ ఎంపీ అయినా లేదా గవర్నర్ పదవి అయినా దక్కవచ్చు అన్న ఆలోచనలతోనే ఆయన ఏపీతో కొత్త కనెక్షన్ పెట్టుకుంటున్నారు అని అంటున్నారు. అదే సమయంలో చంద్రబాబుని పొగడటం కూడా ఆయన వ్యూహంలో కొత్తదనం అని అంటున్నారు. జగన్ వర్సెస్ కిరణ్ అన్నది రానున్న రోజులల్లో చూడబోతామా అన్నది కూడా ఆయన మాటలను చూస్తే అర్థం అవుతోంది.

# టిటిడి ఛైర్మన్ పదవిపై పెరుగుతున్న పోటీ



అమరావతి,ఎపిలో టిడిపి కూటమి ప్రభుత్వంలోకి రావడంతో ఇంతకాలం పార్టీ కోసం పనిచేస్తున్న వారికి ఆశలు పెరిగాయి. నామినేటెడ్ పదవుల పంపిణీ కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో చంద్రబాబు ఏకపక్షంగా నిర్ణయం తీసుకోలేరు. అందుకే పదవుల పందేరం ఇంకా ఒక కొలిక్కి రావడం లేదు. మూడు పార్టీల్లో ఆశావహులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో, ఏ పదవి ఎవరికివ్వాలనే విషయంలో స్పష్టత రావాల్సి ఉంది. ఒక పక్క సామాజిక న్యాయం పాటిస్తూనే, ప్రాంతాల ప్రాధాన్యాలు కూడా చూసుకోవాల్సి ఉంటుంది. కీలక పదవులు ఇప్పటికే కొన్ని ఉత్తరాంధ్రకు దక్కాయి. అయితే మరిన్ని పదవులు కట్టబెట్టడం ద్వారా ఉత్తరాంధ్రలో సైకిల్ స్పీడ్ ని ఇంకా పెంచాలన్నదే టీడీపీ పెద్దల వ్యూహం అని అంటున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ పదవి చాలా ప్రతిష్టాత్మకమైనది. ఈ పదవి కోసం ఎంతోమంది ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. అయితే భక్తితో పాటు, బలమైన సంకత్పం ఉన్నవారే తిరుమల అభివృద్ధికి కృషి చేయగలరు. దీనిని రాజకీయ పదవిగా చూడడానికి లేదు. అలాంటి ఈ పదవి.. ఎపుడూ ఉత్తరాంధ్ర జిల్లాలకు దక్కలేదు. గోదావరి జిల్లాల దాకానే వచ్చి ఆగిపోయింది. ఈసారి అయినా ఉత్తరాంధ్రకు దక్కుతుందా అన్నచర్చకు తెర లేస్తోంది. ఈ కీలక పదవి కోసం టీడీపీకి చెందిన సీనియర్ నేత, మాజీ ఏపీ అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు పేరు పరిశీలనలో ఉందని వార్తలు వస్తున్నాయి. ఆయన 1983 నుంచి రాజకీయాల్లో ఉన్నారు. టీడీపీలో సీనియర్ నేతగా ఉన్నారు. ఈసారి గెలిచి మంత్రి అవుదామని అనుకున్నారు. కానీ అది జరగలేదు. దాంతో ఆయనకు ఈ పదవి ఇస్తారని ప్రచారం సాగుతోంది. బీసీ కాపు నేతగా ఉన్న కళాకు ఈ పదవిని ఇవ్వడం ద్వారా, ఉత్తరాంధ్రలో మరింత పట్టు సాధించవచ్చునని, రానున్న కాలంలో విజయనగరం జిల్లా రాజకీయాల్లో కూడా, టీడీపీ మరింత పటిష్టం అవుతుందని, ఆ పార్టీ పెద్దలు భావిస్తున్నారు. అలాగే, టీటీడీ బోర్డు మెంబర్ పదవిని, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ కి ఇస్తారని మరో ప్రచారం సాగుతోంది. ఆయన కూడా మంత్రి పదవిని ఆశించారు. బలమైన బీసీ నేతగా ఉన్నారు. అలాగే, ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ కి, ఎస్టీ ఛైర్మన్ పదవి ఇస్తారని కూడా ప్రచారంలో ఉంది. ఇలా మూడు జిల్లాల నుంచి ముగ్గురికీ న్యాయం చేస్తారని అంటున్నారు. అయితే ఇలా ఉండగా మరోపక్క ఉత్తరాంధ్రాకే సీనియర్ గా ఉన్న రాజవంశీకులు కుటుంబం నుంచి అశోక గజపతిరాజు పేరు ప్రతిపాదించాలని ఇప్పటికే అధిష్టానం వద్దకు వెళ్లిందని సమాచారం. ఇప్పటికే చాలా ఆలయాలకు వాళ్లు ట్రస్టీలుగా ఉండడం ఎన్నో ఆలయాలు నిర్మాణం చేయడంలో వారికి వారే సాటి లేరు. బీజేపీలో ఉన్న కొంతమంది సీనియర్లు అదేవిధంగా జనసేన పార్టీ నుంచి ఉన్న కొంతమంది పేర్లు కూడా ఇప్పటికే అధిష్టానం వద్దకు పరిశీలనకు వెళ్లాయని.. అయితే నామినేటెడ్ పదవులతో పాటు ఇప్పుడు టిటిడి బోర్డు మెంబర్ విషయంలో పెద్ద తలనొప్పిగా మారిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.. శ్రీకాకుళం జిల్లాకు సంబంధించి స్వాతంత్ర సమరయోధులు కుటుంబం నుంచి వచ్చిన గౌతు శ్యాంసుందర్ శివాజీ కూడా టీటీడీ ఛైర్మన్ ఇస్తారని ఊహాగానాలైతే వినిపిస్తున్నాయి. మరో పక్కన శ్రీకాకుళం పార్టీ ఆవిర్భావం నుంచి కూడా పార్టీని నమ్ముకున్న గుండా ఫ్యామిలీలో ఒకరికి టిటిడి ఛైర్మన్ ఇస్తారని ఇలా ఊహాగానాలనేవి ఎక్కువగా వస్తున్నాయి సో అధిష్టానం ఎలా నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిన పరిస్థితి ఉంది.

### గురుకుల హాస్టళ్ల సమస్యలపై దృష్టి

సిద్దిపేట,రాష్ట్రంలో గురుకుల హాస్టల్లలో సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. జిల్లాలో హుస్నాబాద్ క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ... ప్రతి జిల్లా కలెక్టరు, శాసనసభ్యులు, విద్యశాఖ అధికారులు గురుకుల హాస్టళ్లను బాధ్యతగా సందర్శించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించామన్నారు.

# స్కిల్ యూనివర్శిటీ ఛైర్మన్ గా ఆనంద్ మహీంద్ర..ఉత్తర్వులు జారీ

హైదరాబాద్: స్కిల్ యూనివర్శిటీ ఛైర్మన్ గా ఆనంద్ మహీంద్ర నియామకం అయ్యారు. తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ ఛైర్‌పర్సన్‌గా ప్రముఖ పారిశ్రామిక వేత్త, మహీంద్రా గ్రూపు సంస్థల ఛైర్మన్ ఆనంద్ మహీంద్రా నియమితులయ్యారు. అటోమొబైల్, ఏయిరోస్పేస్, డిఫెన్స్, ఎనర్జీ, ఐటీ వంటి ప్రముఖ రంగాల్లో మహీంద్రా గ్రూపు సంస్థలకు ఆయన ఛైర్మన్‌గా ఉన్నారు.ముఖ్యమంత్రి ఇటీవలి కాలంలోనే ఆనంద్ మహీంద్రాతో సమావేశమైన స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, లక్ష్యాలను వివరించి దానికి ఛైర్ పర్సన్ గా కొనసాగాలను కోరారు. ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో స్కిల్స్ ఇండియా యూనివర్సిటీ ని ఏర్పాటు చేస్తూ ఇటీవలే అసెంబ్లీలో బిల్లు ఆమోదం పొందింది. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు ఏడాది పాటు పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం ఉ



త్తర్వుల్లో పేర్కొంది.

Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com